


జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
# ఆదిలాబాద్
## మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
శనివారం 4 జూలై 2026
పేజీలు : 8


## భూ సర్వే ప్రక్రియలో రెవెన్యూ గ్రామాల హద్దుల నిర్ధారణతో సమస్యల పరిష్కారం



## బీఎల్‌వోల నిర్లక్ష్యమా..?

# అవగాహన లోపమా..?

...ప్రత్యేక ఓటర్ సవరణలో జాప్యం..!


....పత్రాలు అందించినా.. నింపేదెలా అని ప్రజల ఆవేదన

...బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు సేకరించాలని విజ్ఞప్తి




మందమర్రి

పట్టణంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇంటింటికీ ప్రత్యేక సవరణ దరఖాస్తు పత్రాలను పంపిణీ చేస్తున్నప్పటికీ, వాటిని ఎలా నింపాలో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా నిరక్షరాస్యులు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరిగా నివసించే వారు దరఖాస్తులను పూర్తి చేయలేక ఆందోళన చెందుతున్నారు. ఏ వివరాలను ఎక్కడ నమోదు చేయాలి, ఏ పత్రాలు జత చేయాలి, ఎవరికి అందించాలి అనే విషయాల్లో స్పష్టత లేక ప్రజలు అయోమయం పడుతున్నారు.కొన్ని ప్రాంతాల్లో బి ఎల్‌వోలు పత్రాలను పంపిణి చేసిన తర్వాత తిరిగి ఇళ్లకు వెళ్లి వాటిని సేకరించడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో నింపిన దరఖాస్తులను ఎవరికి ఇవ్వాలో తెలియక చాలామంది ఇళ్లలోనే ఉంచుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ఆలస్యం అయ్యే అవకాశముందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రత్యేకించి కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేర్ల సవరణలు, తొలగింపులు వంటి అంశాల్లో ప్రజలకు ప్రత్యక్ష సహాయం అవసరమని స్థానికులు పేర్కొంటున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరాలు తెలియజేస్తూ, అవసరమైన చోట దరఖాస్తులను స్వయంగా నింపించి సేకరిస్తే కార్యక్రమం మరింత సమర్థవంతంగా సాగుతుందని వారు సూచిస్తున్నారు.అధికారులు బీఎల్‌వోలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, పంపిణీ చేసిన ప్రతి దరఖాస్తును తిరిగి ఇంటింటికీ వెళ్లి సేకరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




# అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు ప్రజల దరిచేరాలి

ఎంపీ గోడం నగేశ్ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అభివృద్ధిపై దిశ సమావేశం పాల్గొన్న ఎంపీ ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధులు అధికారులు



# సింగరేణి సంస్థను రాజకీయ వేదికగా మార్చొద్దు

## కార్మికుల చెమటను రాజకీయ లాభాలకు వాడుకోవద్దు

## ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్

## సంస్థ ప్రతిష్టను పరిరక్షించడం, సంస్థ భవిష్యత్తును సురక్షితంగా ఉంచడమే ఏఐటీయూసీ లక్ష్యం



**మంచిర్యాల, 3, జూలై (ప్రజాజ్యోతి):** సింగరేణిని రాజకీయ వేదికగా మార్చవద్దని, కార్మికుల చెమటను రాజకీయ లాభాలకు వాడుకోవద్దని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు . సింగరేణి బొగ్గు ఉత్పత్తి, గణాంకాల అంశంపై మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడాలనుకుంటే దానికి సరైన వేదిక తెలంగాణ శాసనసభేనని, అక్కడ ప్రభుత్వం సమాధానం చెబుతుందని, అవసర మైతే సింగరేణి యాజమాన్యం కూడా అధికారికంగా వివరణ ఇవ్వగలదని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. గనులపైకి వచ్చి పదేపదే మీడియా సమావేశాలు నిర్వహిస్తూ సింగరేణి సంస్థను రాజకీయ వివాదాల్లోకి లాగడం వల్ల సంస్థ ప్రతిష్ట, పరపతి దెబ్బతింటుందని ఆయన శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు 7.5 మిలియన్ టన్నుల అదనపు బొగ్గు ఉత్పత్తి చూపించారని, అప్పట్లో ప్రస్తుతం అదే పార్టీలో ఉన్న ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ బహిరంగంగా విమర్శించిన విషయం అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. అప్పుడు మౌనం వహించిన వారు ఇప్పుడు నీతులు చెప్పడం రాజకీయ అవకాశవాదానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఎవరిదైనా తప్పు జరిగితే ప్రశ్నించడం తమ బాధ్యతేనని స్పష్టం చేశారు. బొగ్గు ఉత్పత్తి గణాంకాలపై అనుమానాలు ఇవాళ కొత్తగా వచ్చినవి కాదని, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కూడా ఇదే తరహా ఆరోపణలు వచ్చాయని తెలిపారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రాజకీయ అవసరాలకు అనుగుణంగా సింగరేణిని వేదికగా ఉపయోగించుకోవడం జరుగుతోందని, అయితే ఏఐటీయూసీ మాత్రం మొదటి నుంచీ ఒకే విధానాన్ని అనుసరిస్తోందని చెప్పారు. సింగరేణి ప్రతిష్టకు భంగం కలిగించే రాజకీయాలను ఎవరు చేసినా తీవ్రంగా వ్యతిరేకిస్తామని అన్నారు. తమ యూనియన్ గౌరవ అధ్యక్షులు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును ఎప్పుడూ గౌరవప్రదంగానే సంబోధించామని, కానీ ఆయన పేరును ఏకవచనంతో పదేపదే ప్రస్తావించడం హుందాతనానికి తగదని అన్నారు. రాజకీయ విభేదాలు, విమర్శలు ఉండవచ్చని, కానీ వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసే భాష ప్రజాస్వామ్య సంస్కృతికి మంచిది కాదని అభిప్రాయపడ్డారు. మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్ సింగరేణికే కేటాయించాలని జరుగుతున్న నిరాహార దీక్షల సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు కూనంనేని సాంబశివరావు ఇచ్చిన సమాధానాన్ని కావాలనే వక్రీకరించడం దురుద్దేశపూరిత చర్యగా పేర్కొన్నారు. ఆయన ఎక్కడా "బొగ్గు దొంగతనం జరగలేదు" అని చెప్పలేదని, టార్గెట్ రాకపోయినా వచ్చినట్లు తప్పుడు లెక్కలు చూపించడం కూడా తప్పేనని పేర్కొన్నారని తెలిపారు. బొగ్గు దొంగతనం జరిగిందని ప్రచారం చేయడం వల్ల కష్టపడి పనిచేస్తున్న కార్మికులు అయోమయానికి గురవుతారని మాత్రమే ఆయన వ్యాఖ్యానించారని వివరించారు. రాబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సంస్థ పేరును రాజకీయ ప్రచారానికి ఆయుధంగా మార్చే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దాదాపు 70 వేల మంది శాశ్వత, కాంట్రాక్టు కార్మికుల భవిష్యత్తు, వారి కుటుంబాల జీవనోపాధి కంటే ఎన్నికలకే ప్రాధాన్యం ఇవ్వడం దురదృష్టకరమని అన్నారు. గనులపై వందలాది మంది వెళ్లి బొగ్గు చూపెట్టాలని అధికారులపై ఒత్తిడి తీసుకురావడం వల్ల కార్మికులు అభద్రతకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. సింగరేణిని రాజకీయ రణ రంగంగా మార్చే ప్రతి ప్రయత్నాన్ని కార్మికలోకం తిప్పికొడుతుందని హెచ్చరించారు. ఇప్పటికే సింగరేణిలో అధిక రాజకీయ జోక్యం, అవినీతి వల్ల సంస్థ తీవ్రంగా నష్టపోయిందని, భవిష్యత్తుపై ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. కార్మికుల ఐక్యతను దెబ్బతీసే, సింగరేణి ప్రయోజనాలకు భంగం కలిగించే రాజకీయ జోక్యాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని స్పష్టం చేశారు. సింగరేణిని రాజకీయాలకు అతీతంగా ఉంచడం, కార్మికుల హక్కులను కాపాడడం, సంస్థ ప్రతిష్టను పరిరక్షించడం, సంస్థ భవిష్యత్తును సురక్షితంగా ఉంచడమే ఏఐటీయూసీ లక్ష్యమని, ఈ విషయంలో కార్మికులు ఐక్యంగా ఉండాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు.

# ప్రతి నెల 1 న పెన్షన్ జమ చేయాలి

**మంచిర్యాల లో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ జాప్యంపై ఆందోళన**

**మంచిర్యాల, 3, జూలై (ప్రజాజ్యోతి):** సింగరేణి వ్యాప్తంగా పదవీ విరమణ చేసిన ఉద్యోగుల కోల్ మైన్స్ పెన్షన్ ప్రతి నెల 1 న వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. లేదంటే గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నా కార్యక్రమాలు చేపడతామని సంఘం హెచ్చరించారు. సంఘం నాయకులు తెలిపిన వివరాల ప్రకారం, దన్‌బాద్ లోని సీఎంపీఎఫ్ అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా ఎస్‌బీఐ బ్యాంకులో ఖాతాలు కలిగిన వేలాది మంది సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు జూలై నెల కోల్ మైన్స్ పెన్షన్ డబ్బులు జూలై 3వ తేదీ ఉదయం 10:30 గంటల వరకు కూడా బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని పేర్కొన్నారు. ఈ సమస్యను ఇప్పటికే సీఎంపీఎఫ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వచ్చే నెలల నుంచి ప్రతి నెల 1వ తేదీనే విశ్రాంత ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో పెన్షన్ జమ అయ్యేలా తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



లేనిపక్షంలో సీఎంపీఎఫ్ కార్యాలయం ఎదుట భారీ స్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్యాంక్ ఎదుట విశ్రాంత ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్యతో పాటు నాయకులు భూపతి లక్ష్మణ్, రామ్ చందర్, ఇక్బాల్ హుస్సేన్, రామ్ బ్రహ్మం, రాజేశం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు "సీఎంపీఎఫ్ అధికారుల నిర్లక్ష్యం నశించాలి", "సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు.

# రొటిగూడా గ్రామస్తుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



**జన్నారం,జూలై 3(ప్రజాజ్యోతి)**జన్నారం మండలంలోని మహమ్మదాబాద్ నుంచి రొటీగూడ గ్రామానికి వెళ్లే 3.90 కిలోమీటర్ల రోడ్డుకు పంచాయతీరాజ్ శాఖ ద్వారా హ్యామ్ రోడ్డు మంజూరు కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క,మంత్రి సీతక్క చిత్రపటాలకు కాంగ్రెస్ కార్యకర్తలు,గ్రామస్తులు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఖానాపూర్ నియోజకవర్గంలో మారుమూల గ్రామాలు, తండాలు, గూడేల్లో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుని సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు.రొటీగూడ రోడ్డుపై గుంతలు ఏర్పడి గ్రామస్తులు, ఆటో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కార్యకర్తలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.హామీ ఇవ్వకుండానే ఎమ్మెల్యే చొరవతో 3.90 కి.మీ. బీటీ రోడ్డు మంజూరైందని సీనియర్ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్క లక్ష్మణ్,మాజీ ఉప సర్పంచ్ భారతపు సత్యనారాయణ, గోనె గట్టయ్య,ఏఎంసీ డైరెక్టర్ పులిశెట్టి లావణ్య నాగేష్, యాతం నాగేష్, కయ్యం శ్రీనివాస్, ఒడ్డెటి కళావతి, శానిగారాపు నాగేష్, కయ్యం రామన్న, పల్లె రాజన్న, సిలివేరి మల్లేష్, సిలివేరి సత్తయ్య, గోనె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వానకాలంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం: ఎంపీడీవో రామకృష్ణ



**సోన్, జూలై 03(ప్రజా జ్యోతి):**వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సోన్ మండల ఎంపీడీవో కె.రామకృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని కడ్తాల్ గ్రామంలో ఆయన పర్యటించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రైనేజీలు, రహదారులు, తాగునీటి వనరులను పరిశీలించి పరిశుభ్రతకు సంబంధించిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. వర్షాకాలంలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. దోమల వ్యాప్తి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులతో ఇండ్లు నిర్మాణం త్వరగా పూర్తి చేయించాలని అన్నారు. నూతనంగా భాద్యతలు చేపట్టి మొదటిసారి గ్రామానికి వచ్చిన ఎంపీడీవోను గ్రామ సర్పంచ్ గుర్రం రాము శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుమయా తస్కిన్ పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు ప్రజల దరిచేరాలి

ఎంపీ గోడం నగేశ్‌ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా


జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అభివృద్ధిపై దిశ సమావేశం పాల్గొన్న ఎంపీ ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధులు అధికారులు






**ఖానాపూర్ జూలై 3( ప్రజా జ్యోతి )**నిర్మల్ జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును మరింత సమర్థవంతంగా చేపట్టి, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ఫలాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాలు అన్నారు శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఎంపీ గోడం నగేశ్ అధ్యక్షతన నిర్వహించగా, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, మున్సిపల్ చైర్‌పర్సన్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో గత ఏడాది కాలంగా వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, పెండింగ్ పనులు, భౌతిక, ఆర్థిక పురోగతిపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులు, ఈజీఎస్, మెటీరియల్ వర్క్స్, 'ఏరువాక--మన ఊరు మన చేను' కార్యక్రమం, బ్యాంకు లింకేజీ, పంచాయతీరాజ్ శాఖ ద్వారా ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, వ్యవసాయ శాఖ ద్వారా పీఎంకేఎస్‌వై అమలు, యూరియా నిల్వలు, విద్యుత్ శాఖ మౌలిక సదుపాయాలు, వైద్య ఆరోగ్య శాఖ నేషనల్ హెల్త్ మిషన్, విద్యాశాఖ సర్వ శిక్ష అభియాన్, పీఎం శ్రీ, మధ్యాహ్న భోజన పథకం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్, ఉద్యానవన, అటవీ, గిరిజన సంక్షేమ, క్రీడలు, పౌర సరఫరాలు, బీఎస్ఎన్ఎల్, నేషనల్ హైవే, లీడ్ బ్యాంక్ తదితర శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి శాఖ పనితీరును విడివిడిగా సమీక్షించి సమస్యలకు తక్షణ పరిష్కారాలు చూపాలని, అభివృద్ధి పనులు జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ కింద అర్హులైన ప్రతి జాబ్‌కార్డు దారుకు ఉపాధి కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు, అటవీ ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని, రేషన్ బియ్యం పారదర్శకంగా పంపిణీ చేయాలని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో పారదర్శకత్వం వహించాలి నిర్మల్ ఎమ్మెల్యే లిలిఏలేటిమహేశ్వర్ రెడ్డి ఎంపీ అనంతరం నిర్మల్ జిల్లాలో నిర్మల్ ముధోల్ ఖానాపూర్ నియోజకవర్గాల ముగ్గురు ఎమ్మెల్యేలు పాల్గొనగామొదట నిర్మల్ ఎమ్మెల్యే నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఉపాధి హామీ పనుల్లో సమాన పనిదినాలు, సమాన వేతనం అమలు చేయాలని, అనుమతులు లభించిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. యూరియా సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, రైతులకు యూరియా యాప్ వినియోగంపై క్షేత్రస్థాయిలో సహాయం అందించాలని పేర్కొన్నారు.

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అటవీ అధికారుల అడ్డంకులు తొలగించాలి, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ వెల్లడి**




ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అటవీ అనుమతుల సమస్యలు ఉన్నచోట పరిష్కారం చూపాలని, నిర్మాణాల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎస్టి ఆదివాసి గిరిజన ప్రజలు ఎక్కువ శాతం నివసిస్తున్న తమ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల అడ్డంకుల తొలగించి ప్రజల సొంతింటి కలను నెరవేర్చేందుకు అటవీశాఖ అధికారులు సమన్వయాన్ని పాటించి పేద ఇందిరమ్మ లబ్ధిదారులకు మేలు చేయాలని కోరారు భైంసా బాసర్ రహదారుల్లో ప్రమాదాలను నివారించేలా చర్యలు తీసుకోవాలి ముధోల్ ఎమ్మెల్యే పవర్ లిలిరామారావు పటేల్ వెల్లడి సమావేశంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, భైంసా సమీప జాతీయ రహదారిపై ప్రమాదకర బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని, బాసర వంతెనను ప్రమాదరహితంగా తీర్చిదిద్దాలని అన్నారు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రెవెన్యూ మ్యాప్‌లు లేని 14 గ్రామాల్లో సర్వేలు, 70 గ్రామాల్లో రీ-సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు. శాఖల వారీగా అధికారులు తమ పురోగతిని వివరించారు. జిల్లాలో 1.74 లక్షల జాబ్‌కార్డుదారులకు ఉపాధి కల్పిస్తున్నట్లు, ఇందిరమ్మ ఇండ్ల కింద 2,136 గృహాలు పూర్తిచేసి రూ.146 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకానికి రూ.17.74 కోట్లు వ్యయం చేసినట్లు, 20 పీఎం శ్రీ పాఠశాలలకు రూ.1.34 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. జిల్లాలో 2.49 లక్షల రేషన్ కార్డుల ద్వారా ప్రతి నెల ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు, 41,950 కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు వివరించారు. పీఎం కిసాన్ పథకం కింద 53 వేల మంది రైతులకు రూ.32 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ అంకం మౌనిక, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాద్రి, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిశోర్ కుమార్, డీఎఫ్‌వో సుశాంత్ సుఖదేవ్ బోబడే, డీఆర్‌వో రాథోడ్ రమేష్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఓపిఏ ఆధ్వర్యంలో నిర్వహించిన భాగ్గ గని కార్మికుల అభ్యర్థనల సభకు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు మద్దతు





**మందమర్రి టౌన్ జూలై 3 ప్రజా జ్యోతి మందమర్రి:** సీఎంఓఏఐ ( సీఎంఓఏఐ) మందమర్రి ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించిన భగ్గ గని కార్మికుల అభ్యర్థనల సభలో చెన్నూరు నియోజకవర్గ మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, పదోన్నతులు, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్మికుల ఐక్యతే వారి బలమని పేర్కొంటూ, వారి న్యాయమైన డిమాండ్ల సాధనకు తన పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎంఓఏఐ నాయకులు, సింగరేణి అధికారులు, కార్మికులు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మంచిర్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యం లో

**గోదావరిఖని ఎల్‌ఎన్టీ గెస్ట్ హౌస్‌లో మెగా రక్తదాన శిబిరం**

**25 మంది ఇంజనీర్లు, అధికారులు రక్తదానం**



**మంచిర్యాల, 3, జూలై (ప్రజా జ్యోతి):** ఎల్ఎన్టీ (ఎల్ అండ్ టి ) సంస్థ వ్యవస్థాపకుడు హెచ్.హెచ్. లార్సెన్ జన్మది నాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నిర్వహించే సేఫ్టీ డే (రక్షణ దినోత్సవం) వేడుకల సందర్భంగా శుక్రవారం గోదావరిఖనిలోని ఎల్ఎన్టీ గెస్ట్ హౌస్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని మంచిర్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జులై 4న జరగనున్న సేఫ్టీ డే కార్యక్రమాలలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎల్ఎన్టీ కంపెనీకి చెందిన 25 మంది ఇంజనీర్లు, అధికారులు ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. శిబిరంలో సేకరించిన రక్తాన్ని మంచిర్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సేకరించారు. ఈ సందర్భంగా ఎల్ఎన్టీ కంపెనీ మేనేజర్ లక్ష్మీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ సంస్థ వ్యవస్థాపకుడి జన్మదినం మరియు సేఫ్టీ డే వేడుకల సందర్భంగా ప్రతి సంవత్సరం సామాజిక బాధ్యతతో భాగంగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన సంస్థ ఇంజనీర్లు, అధికారులను ఆయన అభినందించారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలలో భాగస్వామ్యం కావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. శిబిరంలో సేకరించిన రక్తాన్ని గర్భిణీ స్త్రీలు, కిడ్నీ డయాలసిస్ రోగులు, తలసీమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు, రక్తహీనతతో బాధపడుతున్నవారు, అలాగే రోడ్డు ప్రమాద బాధితులకు అవసరమైన సమయంలో ఉచితంగా అందజేస్తామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన వారందరికీ ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, డాక్టర్ ప్రేమ్ సాయి, సూపర్వైజర్ విజయ్, స్టాఫ్ నర్స్ రజిత సిస్టర్‌తో పాటు ఎల్ఎన్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# భూ సర్వే ప్రక్రియలో రెవెన్యూ గ్రామాల హద్దుల నిర్ధారణతో సమస్యల పరిష్కారం





## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జూలై 3 (ప్రజా జ్యోతి):** జిల్లాలో భూ సర్వే ప్రక్రియను ప్రభుత్వ ఆదేశాల మేరకు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, రెవెన్యూ గ్రామాల హద్దుల నిర్ధారణ ద్వారా భూ సమస్యల పరిష్కారానికి అవకాశం కలుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాల ఆధారంగా ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామాల భూముల హద్దులను స్పష్టంగా గుర్తించడం ద్వారా ప్రభుత్వ భూముల నిర్ధారణ కూడా సులభమవుతుందన్నారు. పట్టా ఉండి మోకాలో లేకపోవడం, మోకాలో ఉండి పట్టా లేకపోవడం వంటి అంశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ భూముల ఆక్రమణలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. భూ సర్వే అనంతరం మ్యాపింగ్ ద్వారా భూముల రికార్డులు పారదర్శకంగా రూపొందించబడతాయని భవిష్యత్తులో భూ వివాదాల నివారణకు ఇది దోహదపడుతుందని తెలిపారు. అదేవిధంగా సర్వే నెంబర్ల ప్రకారం హద్దుల నిర్ధారణ చేపడతామని, ప్రస్తుతం వినియోగంలో ఉన్న రహదారులు, దారులను కూడా మ్యాపింగ్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. సర్వేయర్లు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని అన్నారు. అనంతరం చెన్నూర్, కోటపల్లి మండలాల్లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహారం అందించడంతో పాటు నాణ్యమైన విద్య అందించాలని అధికారులకు సూచించారు. అలాగే కోటపల్లి మండలంలో అమృత్ 2.0 పథకం పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి సదస్సుల్లో అందిన దరఖాస్తులను రెవెన్యూ రికార్డులతో సరిచూసి నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# బజారుకు బట్టసంచితోనే వెళ్లాలి

## లయన్స్ క్లబ్ హైటెక్ సిటీ ఆధ్వర్యంలో ప్రకృతిమిత్ర సంస్థ సౌజన్యంతో ప్లాస్టిక్ సంచులకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు






**.మంచిర్యాల, 3, జూలై (ప్రజాజ్యోతి):** అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచి రహిత దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల హైటెక్ సిటీ ఆధ్వర్యంలో, ప్రకృతి మిత్ర పర్యావరణ సంస్థ మంచిర్యాల సౌజన్యంతో మంచిర్యాల పట్టణంలోని శ్రీ హర్ష జూనియర్ కళాశాల విద్యార్థినులకు ప్లాస్టిక్ వినియోగంపై శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ "వాల్టా" పర్యావరణ చట్టం రాష్ట్ర సభ్యులు, ప్రకృతి మిత్ర వ్యవస్థాపకులు గుండేటి యోగేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై సింగిల్ యూస్ ప్లాస్టిక్ వల్ల సంభవించే నష్టాలు, దుష్ప్రభావాలు, వాటికి ప్రత్యామ్నాయంగా పాటించాల్సిన పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడు బజారుకు వెళ్లే సమయంలో బట్ట, జనపనార, ఉన్ని, కాగితం వంటి ప్రకృతి మిత్ర సంచులను స్వచ్ఛందంగా ఉపయోగించాలని, ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా మానివేయాలని పిలుపునిచ్చారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కాలుష్యం పెరగడంతో పాటు గాలి, నీరు, నేల, చెట్లు, జీవ వైవిధ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, భావితరాల భవిష్యత్తును రక్షించేందుకు ప్రతి పౌరుడు ప్రకృతి మిత్రుడిగా మారాల్సిన అవసరం ఉందన్నారు. "ప్లాస్టిక్ చోటు పుడమికి చేటు" అని అన్నారు. లయన్స్ క్లబ్ హైటెక్ సిటీ అధ్యక్షులు రాజు పటేల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకుని సమాజంలో ఇతరులను కూడా చైతన్యపరచాలని సూచించారు. చిన్న చిన్న మార్పులతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా యోగేశ్వర్ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా వివిధ పదార్థాలతో తయారు చేసిన సంచులు, ప్రకృతి మిత్ర వస్తువులను ప్రదర్శించి వాటి ఉపయోగాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ హైటెక్ సిటీ క్యాబినెట్ సభ్యుడు సిహెచ్. హనుమంతరావు, కళాశాల ప్రిన్సిపల్ లావణ్య, సంస్థ సభ్యులు బి. రాజశేఖర్, ఎం. శరత్ చంద్ర, ఎన్. రాజేంద్ర ప్రసాద్, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారికి పోలీసులంటే భయం ఉండాలి

### పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



**మంచిర్యాల, 3, జూలై (ప్రజాజ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులకు పోలీసులంటే భయం కలిగేలా అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లోని వివిధ విభాగాల్లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీసీఎస్ ఏసీపీలు కె. రవీందర్, టి. ప్రవీణ్ కుమార్, టాస్క్ ఫోర్స్ ఏసీపీ బి. శ్రీనివాస్ శుక్రవారం పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నేరాల నియంత్రణ, చట్టవ్యతిరేక కార్య కలాపాల నిర్మూలన, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేలా, నేరాలకు అడ్డుకట్ట వేసేలా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు.

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు



**మంచిర్యాల, జూలై 3 (ప్రజాజ్యోతి):** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుకు అత్యంత ప్రాధాన్యత ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవడంతో పాటు వివరాలను సరిచేసుకోవాలని మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు సూచించారు. మంచిర్యాల నియోజకవర్గంలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1, 22, 23, 54 డివిజన్లలో బీఎల్ఓలు, బీఎల్ఏలు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే కార్యక్రమంలో భాగంగా ఓటర్లను కలిసి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయడం, తప్పులు ఉంటే సరిచేయడం, చిరునామా మార్పులు, కొత్తగా అర్హత పొందిన యువత ఓటర్లుగా నమోదు కావడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటరు నమోదు ప్రక్రియ ఎంతో కీలకమని అన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని, ఎన్నికల సంఘం చేపడుతున్న కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, స్థానిక కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బురదమయంగా మారిన 1వ వార్డు రోడ్లు

**పాఠశాలకు వెళ్లాలంటే బురదలో నడవాల్సిందే**



**ఆసిఫాబాద్ జూలై 3 ప్రజా జ్యోతి ఆసిఫాబాద్:** పట్టణంలోని 1వ వార్డు పరిధిలో గాంధీ స్కూల్, పోచమ్మ కాలనీ రోడ్లు బురదమయంగా మారి ప్రజలు నరకయాతన పడుతున్నారని కౌన్సిలర్ జాడి వినోద్ కుమార్ మండిపడ్డారు. శుక్రవారం ప్రాంతాన్ని పరిశీలించారు. చిన్నపాటి వర్షానికే రోడ్లపై గుంతల్లో నీరు నిలిచిపోయి చెరువులను తలపిస్తోందని తెలిపారు. గాంధీ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు చెప్పులు చేతిలో పట్టుకుని బురదలో నడవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. వృద్ధులు, మహిళలు జారిపడుతున్న ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి నిల్వతో దోమల బెడద పెరిగిందని, డెంగీ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటమే దీనికి కారణమన్నారు. ఈ సమస్యపై మున్సిపల్ కమిషనర్, వార్డు ఆఫీసర్లు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

## తాళ్లపేట పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

**-?ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరగాలి**

**-?నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు**

**-?వైద్య సిబ్బందికి డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ ఆదేశం**




**దండేపల్లి,జూలై 3(ప్రజాజ్యోతి)** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ నరేందర్ రాథోడ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన తాళ్లపేట పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి, వైద్యాధికారి డాక్టర్ స్నేహిత, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గర్భవతుల వివరాలను వంద శాతం నమోదు చేయాలి. ప్రసవాల కోసం గర్భిణులను మంచిర్యాల, లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రులకే తరలించాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు తీసుకెళ్తే ఆశా, ఆరోగ్య కార్యకర్తలపై చర్యలు ఉంటాయన్నారు ప్రతి బుధ, శనివారాల్లో పిల్లలకు సరైన సమయంలో వ్యాక్సిన్లు అందించాలని. 14 ఏళ్లు నిండిన బాలికలకు హెచ్‌పీవీ (గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ) వ్యాక్సిన్ ఇప్పించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా చూడాలి. పంచాయతీల సహకారంతో 'డ్రై డే' పాటించి, పరిసరాలను శుభ్రంగా ఉంచాలి. ఆశ కార్యకర్తల వద్ద డెంగ్యూ, మలేరియా కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు, 30 ఏళ్లు పైబడిన వారికి వంద శాతం బీపీ, షుగర్ పరీక్షలు చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. 'ఈ-ఔషధి' పోర్టల్‌లో మందుల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు.వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, సమన్వయంతో పనిచేయాలని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, నర్సింగ్ అధికారులు, జూనియర్ అసిస్టెంట్ వెంకట సాయి పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రైవేటు వైద్యుల సమన్వయంతో ముందస్తు గుర్తింపు, తక్షణ చికిత్స అందించాలి

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్**

**జిల్లాలో వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధులపై సమీక్ష**




**మంచిర్యాల, 3,జూలై (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ--ప్రైవేటు వైద్యుల సమన్వయంతో ముందస్తు గుర్తింపు, తక్షణ చికిత్స అందించాలని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు .జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ శుక్రవారం ఐడీఓసీలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ చిన్నపిల్లల వైద్య నిపుణులు, చర్మ సంబంధిత వ్యాధి నిపుణులతో వ్యాక్సిన్ ప్రివెంటేబుల్ డిసీజెస్ (టీకాల ద్వారా నివారించగల వ్యాధులు)పై సమీక్ష సమావేశాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ పరిధిలో నమోదైన 11 చర్మ సంబంధిత వైద్య నిపుణులు, 22 మంది చిన్నపిల్లల వైద్య నిపుణులు ఉన్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య నిపుణులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం, బాధితులకు సమయానికి వైద్య సేవలు అందించడం, వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధుల పర్యవేక్షణలో ప్రతి వైద్య నిపుణుడు భాగస్వామి కావాలని సూచించారు. ముఖ్యంగా ప్రైవేట్, ప్రభుత్వ వైద్యులు వ్యాక్సిన్ ప్రివెంటేబుల్ డిసీజెస్ సర్వైలెన్స్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. ప్రభుత్వపరంగా యాక్టివ్ సర్వైలెన్స్, ప్రైవేట్ పరంగా ప్యాసివ్ సర్వైలెన్స్ నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా సర్వైలెన్స్ అధికారి, జిల్లా ఎపిడెమియాలజిస్ట్ ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శిస్తూ వివరాలు సేకరించాలని, ముఖ్యంగా చిన్నపిల్లల ఆసుపత్రులు, చర్మ సంబంధిత వ్యాధి నిపుణుల ఆసుపత్రులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రోగుల రక్త నమూనాల సేకరణ, శాంపిల్స్ పంపిణీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ప్రత్యేక వైద్య నిపుణులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి రోజువారీ సమాచారాన్ని సేకరించాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో రాపిడ్ రెస్పాన్స్ టీమ్ ద్వారా తక్షణ చర్యలు చేపట్టాలని, అవసరమైన రాపిడ్ పరీక్షలు నిర్వహించాలని, తెలంగాణ డయాగ్నస్టిక్స్ ద్వారా అవసరమైన అన్ని పరీక్షలు చేయించాలని తెలిపారు. అవుట్ బ్రేక్ పరిస్థితులు తలెత్తిన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. మీజిల్స్, డిఫ్తీరియా, టిటానస్ వంటి వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధులపై ప్రత్యేక సర్వైలెన్స్ నిర్వహించి 100 శాతం కేసుల నమోదుకు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం ఆసుపత్రులు అవసరమైన అన్ని సర్టిఫికెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ముఖ్యంగా ఫైర్ సేఫ్టీ, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రిజిస్ట్రేషన్, వైద్యుల వివరాలు, వైద్య సేవలకు తీసుకుంటున్న చార్జీలు, ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉండే సమయాలను ప్రజలకు కనిపించే విధంగా ప్రదర్శించాలని సూచించారు. కన్సల్టేషన్ ఫీజులు, ఇతర రుసుములను తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో స్పష్టంగా ప్రదర్శించాలని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగులకు మంచినీరు, కూర్చునే సదుపాయాలు సహా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. నిబంధనలు పాటించని ఆసుపత్రులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ శ్రీధర్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, డిపిఓ ప్రశాంతి, డిడిఎం ప్రవళిక, ఎపిడెమియాలజిస్ట్ సుమన్‌తో పాటు జిల్లాలోని చిన్నపిల్లల వైద్య నిపుణులు, చర్మ సంబంధిత వ్యాధి నిపుణులు పాల్గొన్నారు.

# సింగరేణి అధికారుల పీఆర్‌పీని యాజమాన్యం తక్షణమే విడుదల చేయాలి

**సింగరేణి బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు**

**సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలకు అసోసియేషన్ సంఘీభావం**



**మంచిర్యాల, 3,జూలై (ప్రజాజ్యోతి):** సింగరేణి అధికారుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం జూన్ 30 నుంచి కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు సంఘీభావంగా సింగరేణి బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్పొరేట్ కేంద్ర కార్యవర్గం, కార్పొరేట్ కమిటీ ఆధ్వర్యంలో హెడ్ ఆఫీస్ ముందు ఏర్పాటు చేసిన దీక్ష శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొంటున్న అధికారులకు సంపూర్ణ సంఘీభావం తెలియజేస్తూ, వారి న్యాయమైన డిమాండ్ల సాధనకు సింగరేణి బీసీ మరియు ఓబీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు నాయకులు తెలిపారు . ముఖ్యంగా సింగరేణి అధికారుల పీఆర్‌పీని యాజమాన్యం తక్షణమే విడుదల చేయాలని కోరుతూ తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. అధికారుల సమస్యలను యాజమాన్యం సానుకూల దృక్పథంతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్పొరేట్ కేంద్ర కార్యవర్గం, కార్పొరేట్ కమిటీ సభ్యులతో పాటు బీసీ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వి.వి. రావు, నల్లపూరి రమేష్, జనరల్ సెక్రటరీ కె.వి. ప్రకాష్, గోలి వెంకటేశ్వర్లు (డీజీఎం), కార్పొరేట్ బ్రాంచ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్, గౌరవ చీఫ్ లైజన్ ఆఫీసర్ పి. హరిశంకర్, ఆర్. విజయ ప్రసాద్ (జీఎం హెచ్ఆర్డీ), బూర రవీందర్ (ఏటీఎంఎస్ ఓటూ డైరెక్టర్ ఆపరేషన్స్), ఏ. వెంకటస్వామి, పి. రామకృష్ణ, ఐ. రాజేంద్ర ప్రసాద్, నరేష్, ఏ. రామచందర్, పి. ప్రియాంక, శిరీష, ఉమా తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి సింగరేణి బీసీ మరియు ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్పొరేట్ కేంద్ర కార్యవర్గం నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కొనసాగుతున్న సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలు

**భారీ వర్షంలోనూ " బలాదూర్ " అంటున్న సింగరేణి అధికారుల దీక్షలు**

**వర్షం సాక్షిగా కొనసాగుతున్న అధికారుల రిలే నిరాహార దీక్షలు స్పందన కోసం ఎదురు చూస్తున్న అధికారులు..**

**ఐదో రోజుకు దీక్షలు- ప్రభుత్వం, యాజమాన్యం స్పందించాలని అధికారుల డిమాండ్**

**మంచిర్యాల, జూలై 3 (ప్రజా జ్యోతి):** .సింగరేణి అధికారుల సంఘం సీఎంఓఏఐ పిలుపు మేరకు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి ఐదవ రోజుకు చేరుకున్నాయి. శ్రీరాంపూర్ ఏరియాలో శుక్రవారం భారీ వర్షం కురుస్తున్నప్పటికీ అధికారులు శాంతియుతంగా తమ నిరసన కార్యక్రమాలను కొనసాగించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధికారులు దీక్షలో కూర్చోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. గత ఐదు రోజులుగా అధికారులు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నప్పటికీ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ఇప్పటివరకు స్పష్టమైన స్పందన ఇవ్వకపోవడంపై అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి యాజమాన్యం వెంటనే ముందుకు రావాలని వారు డిమాండ్ చేశారు. అధికారుల సమస్యలను విస్మరించడం సరికాదని, సంస్థ అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకమని వారు అన్నారు. ఈ ఐదవ రోజు రిలే నిరాహార దీక్షలో బీమన్న (జాయింట్ సెక్రటరీ), క్రాంతికుమార్ (డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్), నరేష్ (అండర్ మేనేజర్, ఆర్కే-7), గుత్తుల శ్రీనివాస్ (డిప్యూటీ సూపరింటెండింగ్ ఇంజనీర్, ఐకే ఓసీ), సాయితేజ (సీనియర్ అండర్ మేనేజర్, ఐకే ఐఏ), సృజన్ పాల్ (సీనియర్ పర్సనల్ ఆఫీసర్, ఆర్కే ఎన్‌టీ), హరికృష్ణ (సీనియర్ పర్సనల్ ఆఫీసర్, ఆర్కే-5), నరేష్ (డిప్యూటీ మేనేజర్, ఎస్ఆర్పీ-1), తిరుపతి (అండర్ మేనేజర్, ఎస్ఆర్పీ ఓసీ) తదితరులు దీక్షలో



పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ఏరియా అధికారులు దీక్షా శిబిరానికి చేరుకుని సంఘీభావం ప్రకటించారు. అలాగే ప్రతిరోజూ ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు దీక్షా శిబిరానికి వచ్చి సంఘీభావం తెలుపుతున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, అధికారుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించాలని కోరారు. సమస్యలు మరింత జటిలం కాకముందే చర్చల ద్వారా పరిష్కారం చూపాలని అభిప్రాయపడ్డారు. పే అప్‌గ్రేడేషన్, పీఆర్పీ చెల్లింపులతో పాటు ఇతర డిమాండ్లపై యాజమాన్యం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు. జులై 13 వరకు నిర్వహించనున్న రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని, ప్రతి రోజు అధిక సంఖ్యలో అధికారులు పాల్గొనాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు.

# మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య సమరానికి చిరస్థాయి స్ఫూర్తి

**విశ్లేషకులు ఆళవందార్ వేణు మాధవ్**

**నేడు అల్లూరి సీతారామరాజు జయంతి (4, జూలై)**

**మంచిర్యాల, జూలై 3 (ప్రజాజ్యోతి):** భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుల్లో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు ముందువరుసలో నిలుస్తుందని, ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని విశ్లేషకులు ఆళవందార్ వేణు మాధవ్ కొనియాడారు . 1897 జూలై 4న అప్పటి విశాఖపట్నం జిల్లాలోని పాండ్రంగి గ్రామంలో జన్మించిన అల్లూరి సీతారామరాజు చిన్ననాటి నుంచే దేశభక్తి, ధైర్యసాహసాలు, ఆధ్యాత్మిక చింతన వంటి విలువలను అలవర్చుకున్నారని తెలిపారు. దేశమంతా పర్యటిస్తూ భారతీయ సంస్కృతి, వేదాంతం, యోగా, ఆయుర్వేదం వంటి అంశాలపై అవగాహన పెంపొందించుకున్నారని తెలిపారు. ఆ కాలంలో బ్రిటిష్ ప్రభుత్వం అమలు చేసిన అటవీ చట్టాల వల్ల గిరిజనుల జీవన విధానం తీవ్రంగా దెబ్బతిన్నదని, పోడు వ్యవసాయంపై నిషేధం, వెట్టిచాకిరి, అధిక పన్నులు, అధికారుల దౌర్జన్యాలు గిరిజనుల జీవితాలను దుర్భరంగా మార్చాయని తెలిపారు. ఈ అన్యాయాలను గమనించిన అల్లూరి సీతారామరాజు గిరిజనులను సంఘటితం చేసి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టారని అన్నారు . 1922 నుండి 1924 వరకు జరిగిన పోరాటం భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో కీలక అధ్యాయంగా నిలిచిందని తెలిపారు. అల్లూరి నాయకత్వంలో గిరిజనులు చింతపల్లి, కృష్ణదేవిపేట, రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఆధునిక ఆయుధాలతో ఉన్న బ్రిటిష్ సైన్యాన్ని అడవులను అడ్డాగా చేసుకుని గెరిల్లా యుద్ధ పద్ధతిలో ఎదుర్కొని బ్రిటిష్ అధికారులను కలవరపరిచారని తెలిపారు. అల్లూరి సీతారామరాజు ప్రజల కోసం, గిరిజనుల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని



తెలిపారు. వ్యక్తిగత స్వార్థం కోసం కాకుండా సామాజిక న్యాయం కోసం పోరాడారని తెలిపారు. ఆయన ధైర్యం, నాయకత్వం, ప్రజలపై ప్రేమ కారణంగానే చరిత్రలో “మన్యం వీరుడు”గా చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. 1924 మే 7న బ్రిటిష్ ప్రభుత్వం అల్లూరిని పట్టుకుని విచారణ లేకుండానే కాల్చిచంపినప్పటికీ, ఆయన ఆశయాలను, దేశభక్తిని, పోరాట స్ఫూర్తిని అంతం చేయలేకపోయిందని తెలిపారు. నేటి తరానికి అల్లూరి జీవితం గొప్ప సందేశాన్ని అందిస్తోందని తెలిపారు. దేశభక్తి అంటే కేవలం నినాదాలు కాదని, ప్రజల కోసం నిలబడటం, అన్యాయాన్ని ఎదిరించడం, సమాజానికి సేవ చేయడమే నిజమైన దేశభక్తి అని ఆయన జీవితం నిరూపించిందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జయంతి కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, అది స్వేచ్ఛ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకునే రోజు అని తెలిపారు. యువతలో జాతీయ భావన, సేవా దృక్పథం పెంపొందించేందుకు అల్లూరి జీవితం మార్గదర్శకంగా నిలుస్తుందని ఆళవందార్ వేణు మాధవ్ తెలిపారు.

## ఢిల్లీ జాతీయ సదస్సుకు డీపీఆర్ఓ సంపత్ కుమార్




**ఆసిఫాబాద్ జులై 3 ప్రజా జ్యోతి** జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్ఓ) సంపత్ కుమార్ ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి మీడియా కమ్యూనికేషన్ అధికారుల సదస్సుకు ఎంపికయ్యారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోని ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఐఐఐడిఈయంలో ఈ సదస్సు జరుగుతోంది. మీడియా నిర్వహణ, ప్రజా కమ్యూనికేషన్, ఎన్నికల సమాచార ప్రచారం, ఫేక్ న్యూస్ నియంత్రణ, సోషల్ మీడియా వినియోగంపై సాంకేతిక సెషన్లు నిర్వహిస్తున్నారు. తెలంగాణ నుంచి ఎంపికైన అధికారుల్లో సంపత్ కుమార్ ఒకరు. సదస్సులో పాల్గొనేందుకు ఆయన బుధవారం ఢిల్లీ వెళ్లారు. జాతీయ స్థాయి సదస్సుకు జిల్లా అధికారి ఎంపిక కావడంపై జిల్లా యంత్రాంగం, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు..

## సీఐటీయూ నాయకుల అసత్య ప్రచారాన్ని ఖండించిన పి. మాధవ నాయక్



**మంచిర్యాల,3, జులై ( ప్రజా జ్యోతి):**కోల్ ఇండియాలో 2026 జూన్ 5న జరిగిన అపెక్స్ బోర్డు సమావేశంపై సీఐటీయూ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ ఏబీకేఎంఎస్--బీఎంఎస్ కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్ తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఎంఎస్ మొదటి నుంచీ కార్మికుల ప్రయోజనాల దృష్ట్యా ఒకే డిమాండ్‌ను స్పష్టంగా వినిపించిందన్నారు. వెంటనే ద్వాదశ వేతన కమిటీ ఏర్పాటు చేసి వేతన సవరణ ప్రక్రియ ప్రారంభించాలని బీఎంఎస్ డిమాండ్ చేసిందని తెలిపారు.కొత్త కార్మిక చట్టాల అమలు, రహస్య బ్యాలెట్ ఎన్నికలు, చర్చల మండలి ఏర్పాటు వంటి ప్రక్రియలకు సమయం పట్టే అవకాశం ఉన్నందున వాటితో సంబంధం లేకుండా ముందుగా కార్మికుల వేతన సవరణ చేపట్టాలని బీఎంఎస్ స్పష్టంగా కోరిందన్నారు. ఈ డిమాండ్‌కు ఇతర కార్మిక సంఘాలు కూడా మద్దతు తెలిపాయని అన్నారు.అయితే అనంతరం వామపక్ష కార్మిక సంఘాలు రాజకీయ ప్రయోజనాల కోసం కార్మిక చట్టాల అంశాన్ని ఇందులోకి తీసుకువచ్చాయని, కార్మికుల సమస్యలను పక్కనపెట్టి రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. కార్మిక చట్టాల ప్రకారం 51 శాతం ఓట్లు సాధించిన సంఘానికి ఏకైక చర్చల సంఘం హోదా లేదా 20 శాతం కంటే ఎక్కువ ఓట్లు సాధించిన సంఘాలతో చర్చల మండలి ఏర్పాటు చేసే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని పి. మాధవ నాయక్ వివరించారు. కార్మికుల ప్రయోజనాల కోసం నిరంతరం పోరాడుతున్న బీఎంఎస్‌ను ప్రశ్నించే నైతిక హక్కు కార్మిక సమస్యలపై చిత్తశుద్ధి లేని సీఐటీయూ నాయకులకు లేదన్నారు. బీఎంఎస్ రాజకీయాలకు అతీతంగా, జాతీయ భావజాలంతో కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం మాత్రమే పోరాటం చేస్తోందని తెలిపారు.

## చినుకు పడితే పవర్ కట్-ఇబ్బందులు పడుతున్న పట్టణవాసులు




**జన్నారం,జూలై3(ప్రజాజ్యోతి)**వర్షాకాలం వచ్చిందంటే చాలు జన్నారం పట్టణ వాసులకు కరెంట్ కష్టాలు మొదలవుతాయి. చిన్నపాటి గాలివాన వచ్చిన చాలు విద్యుత్ అధికారులు కరెంట్ తీసేయడంతో జన్నారం పట్టణ వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు.వర్షం పడినగానీ మండలంలోని చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో కరెంట్ ఉంటుంది కానీ,చిన్నపాటి గాలివానకి మండల కేంద్రంలో కరెంట్ తీసేస్తున్నారని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలంలో కరెంట్ కోతలతో ఇబ్బందులు పడ్డ ప్రజలకి,ఇప్పుడు చిన్నపాటి వర్షానికి కరెంటు తీసేయడంతో ఇంట్లో ఉన్న పిల్లలు,పెద్దలు పడుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని,అంతేకాకుండా చిన్న చిన్న వ్యాపారస్తులు జిరాక్స్ సెంటర్ల వారు,విద్యుత్ పై ఆధారపడి వ్యాపారం చేసుకునేవారు నష్టపోతున్నారని పొనకల్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ కోతల నుండి తమకు ఉపశమనం కలిగించాలని విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు

## ఎస్ ఐ ఆర్ ఫామ్ లు నింపేందుకు రాజకీయ పార్టీల బి ఎల్ ఓ ల తో పాటు

**బి ఎల్ ఏ -2లకు సమగ్ర అవగాహన కల్పించాలి**

**తహసిల్దార్ కు వినతించిన మైనార్టీ నాయకులు**




**ఖానాపూర్, జూలై 3 ( ప్రజా జ్యోతి):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా బి ఎల్ ఓ లు రాజకీయ పార్టీల బి ఎల్ ఏ -2లకు సర్ ఫారాలు నింపే విధానంపై సమగ్ర శిక్షణ, అవగాహన కార్యక్రమం కల్పించాలని ఖానాపూర్ మండల తాసిల్దార్ సుజాత రెడ్డి ఏ ఈ ఆర్ ఓ ని మైనార్టీ నాయకులు కోరారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుతం ఎస్ ఐ ఆర్ ఫారాలు నింపే ప్రక్రియలో అనేక సందేహాలు ఎదురవుతున్నాయని వివిధ ప్రాంతాల్లో ప్రాంతాల్లో బి ఎల్ ఓ లు ఒకే అంశంపై వేర్వేరు విధాలుగా సమాధానాలు ఇస్తుండటంతో వాలంటీర్లు, బి ఎల్ ఎ-2లు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. దీని పట్ల అన్ని సందేహాలు ఆందోళన తొలగేందుకు ప్రత్యేక అవగాహన వివిధ రాజకీయ పార్టీల వ్యక్తులతో పాటు సంబంధిత బీఎల్ ఓ లతో సమావేశం ఏర్పాటు చేసి, ఫారాలు నింపే విధానంపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ సుజాత రెడ్డి డిప్యూటీ తాసిల్దార్ మంజులలు త్వరలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపినట్లు నాయకులు అన్నారు ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ షోయబ్ హుసేన్, కాంగ్రెస్ పార్టీ,సర్ ఖానాపూర్ ఇన్చార్జి షబ్బీర్ పాషా, జామా మస్జిద్ అధ్యక్షులు జహీర్ అహ్మద్, దారుల్ ఉలూమ్ ప్రతినిధులు మౌలానా షాహిద్, మౌల్వి రయీస్, సర్ కో-ఆర్డినేటర్ అఫ్రోజ్, నాయకులు షేక్ అహ్మద్, వాసే ఖాన్, ఎంఐఎం ప్రతినిధులు అఫ్సర్ ఖాన్, కైఫ్ అహ్మద్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సలాం దినేష్ మృతి: నివాళులర్పించిన బోట్ల కార్తీక్

**కన్నీటి నివాళి: కన్నెపల్లిలో ఫోరం నేతలు**



**ఆసిఫాబాద్ జూలై 3 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ తిర్యాని కన్నెపల్లి గ్రామ పంచాయతీ ఉప సర్పంచు కవిత భర్త సలాం దినేష్ అకాల మరణం చెందిన వార్త తెలుసుకుని ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బోట్ల కార్తీక్, కొమురం భీం జిల్లా ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు దీపక్ మొండే వారి కుటుంబాన్ని పరామర్శించారు.బుధవారం తిర్యాని, రెబ్బెన మండలాల ఉప సర్పంచులతో కలిసి వారు కన్నెపల్లికి వెళ్లి మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బోట్ల కార్తీక్ మాట్లాడుతూ ఉప సర్పంచుల కుటుంబాలకు ఫోరం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. దినేష్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో తిర్యాని, రెబ్బెన మండలాల ఉప సర్పంచులు పాల్గొన్నారు.

## సుర్దాపూర్‌లో పోడు రైతులతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి భేటీ



**కెరమెరి, జూలై 3 జూలై ప్రజా జ్యోతి** కెరమెరి మండలం సుర్దాపూర్ గ్రామంలో పోడు భూముల సమస్యలపై ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పోడు రైతులతో సమావేశమయ్యారు. గ్రామంలో పర్యటించిన ఆమె రైతుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తరతరాలుగా అటవీ భూములను నమ్ముకుని వ్యవసాయం చేస్తున్న పోడు రైతులకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. సుర్దాపూర్‌తో పాటు మండలంలోని అర్హులైన ప్రతి పోడు రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఫారెస్ట్, రెవెన్యూ శాఖ అధికారులతో సమన్వయం చేసి సర్వే ప్రక్రియ చేపట్టి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.పోడు రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, అటవీ శాఖ అధికారుల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు.ఈ కార్యక్రమంలో కెరమెరి బీఆర్ఎస్ నాయకులు, పోడు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కెరమెరిలో బస్టాండ్ లేక ప్రయాణికులు, విద్యార్థులకు ఇబ్బందులు



**కెరమెరి, జూలై 3: ప్రజా జ్యోతి** కెరమెరి మండల కేంద్రంలో బస్టాండ్ సౌకర్యం లేక ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఇప్పటికీ శాశ్వత బస్టాండ్ నిర్మాణం జరగకపోవడంతో ప్రయాణికులు ఎండ, వర్షంలోనే బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది.ప్రతిరోజూ సుమారు 300 మంది ప్రయాణికులు, విద్యార్థులు కెరమెరి నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ కూర్చునేందుకు బెంచీలు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల వంటి కనీస వసతులు కూడా లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు బస్సుల కోసం గంటల తరబడి నిలబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.కెరమెరి మండల కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన బస్టాండ్‌ను వెంటనే నిర్మించాలని, తాగునీరు, మరుగుదొడ్లు, ప్రయాణికుల విశ్రాంతి షెడ్ వంటి మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులు, ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ ఏలేటి నీలిమ



**నేరడిగొండ, జూలై 03( ప్రజాజ్యోతి ):**ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన రాజ్యాంగబద్ధమైన హక్కు అని నేరడిగొండ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ఆమె వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, యువకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు.అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడైన పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు తమ పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాలను ఒకసారి సరిచూసుకోవాలని సూచించారు. జాబితాలో పేరు లేకపోయినా, తొలగించబడినా, లేదా మార్పులు-చేర్పులు అవసరమైతే వెంటనే సంబంధిత బీఎల్ఓ లేదా బీఎల్ఏ లను సంప్రదించి నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఒక్క అర్హుడైన ఓటరు కూడా నష్టపోకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా కొనసాగాలని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరు నమోదు, సవరణల్లో ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే తమను సంప్రదించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త, వార్డు సభ్యుడు సాబ్లే సంతోష్ సింగ్, నాయకులు ఎస్ కె బాబా, మాజీ వార్డు సభ్యుడు రాథోడ్ రాజశేఖర్, బీఎల్ఏ ఏలేటి మనోజ్, బీఎల్ఓ అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుని పనితీరుపై అసంతృప్తి వ్యక్తపరిచిన సరెండి గ్రామపంచాయతీ పాలకవర్గం



కొమరం భీం జిల్లా ప్రతినిధి ( వాంకిడి ) జులై 03 ప్రజా జ్యోతి కొమురం భీం జిల్లా కేంద్రంలోని వాంకిడి మండలం సరెండి గ్రామపంచాయతీలో గల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యా యుని పనితీరుపై అసంతృప్తి వ్యక్తపరిచిన గ్రామ పాలకవర్గం ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ మాట్లాడుతూ సరెండి ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ సరిగా విధులు నిర్వహించకపోవడం తో పిల్లల కు విద్య అందని దాక్షగా మిగిలిన వైన్యం ఉపాధ్యాయుడి పనితీరు లో మార్పు చెంది పిల్లలకు నాణ్యమైన విద్య అందించే విధంగా వేరొక ఉపాధ్యాయులను డిప్యూటేషన్ పై పాఠశాలకు కేటాయించి పిల్లల బంగారు భవితవ్యం కోసం ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ఉప సర్పంచ్ పాలకవర్గం గ్రామ పంచాయితీ ప్రజలు విద్యార్థిని తల్లిదండ్రులు కోరారు

## బాసర ఆలయ పునర్నిర్మాణానికి ముహూర్తం ఖరారు

**6 నుంచి బాలాలయంలో అమ్మవారి నిత్యపూజలు..**



**బాసర, జులై 3 (ప్రజా జ్యోతి)** నిర్మల్ జిల్లా । చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ముహూర్తం ఖరారు అయింది. ఈ నెల 4 నుంచి 5 వరకు ప్రధాన ఆలయంలో పునర్నిర్మాణ సంబంధిత ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. శృంగేరి పీఠాధిపతులు అందించిన దేవతా మూర్తులకు ఆలయ వేద పండితులు, అర్చకులు సంకల్పం, గణపతి పూజ, కళాపకర్షణ పూజలు నిర్వహించనున్నారు. అనంతరం శృంగేరి పీఠాధిపతులు అందించిన ఉత్సవ మూర్తులను బాలాలయంలో ప్రతిష్ఠించనున్నట్లు స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి తెలిపారు. సోమవారం నుంచి ప్రధాన ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సేవలను బాలాలయానికి తాత్కాలికంగా మారుస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రస్తుతం ఉన్న రూ.150 అక్షరాభ్యాస మండపాన్ని బాలాలయం వద్ద ఏర్పాటు చేయనున్నారు. రూ.1000 ప్రత్యేక అక్షరాభ్యాసం, కుంకుమార్చన సేవల కోసం వేర్వేరు మండపాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రూ.150 అక్షరాభ్యాస మండపాన్ని ధ్యాన మందిరంలోకి మార్చనున్నట్లు ఈఓ పేర్కొన్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లు, టికెట్ కౌంటర్లు, ప్రసాద కౌంటర్లను సక్రమంగా ఏర్పాటు చేయనున్నట్లు ఇఓ అంజనీదేవి తెలిపారు.

## ఉద్యోగులు, అధికారులు తమ హక్కుల సాధన కోసం అన్ని వర్గాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉన్నది

**అధికారుల పోరాటానికి శ్రీరాంపూర్ బ్రాంచ్ బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘీభావం**



**మంచిర్యాల, 3,జూలై (ప్రజాజ్యోతి):** ఉద్యోగులు, అధికారులు తమ హక్కుల సాధన కోసం అన్ని వర్గాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని శ్రీరాంపూర్ బ్రాంచ్ సింగరేణి బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అన్నారు .ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘీభావం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట అధికారుల సంఘం చేపట్టిన పోరాటానికి మద్దతుగా , శ్రీరాంపూర్ బ్రాంచ్ సింగరేణి బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర నాయకులు ముస్కె సమ్మయ్య మాట్లాడుతూ అధికారుల సంఘం ముందుంచిన న్యాయమైన డిమాండ్లను సింగరేణి యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి అవలంబించకుండా, ఉద్యోగులు మరియు అధికారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే అధికారుల సంఘం చేపడుతున్న న్యాయబద్ధమైన పోరాటానికి బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో అధికారుల సంఘం చేపట్టే ఆందోళనలు, పోరాట కార్యక్రమాలకు కూడా తమ సంఘం అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ నాయకులు బారుపాటి మారుతి, బ్రాంచ్ కార్యదర్శి బద్రి బుచ్చయ్య, సహాయ కార్యదర్శి చంద్రమోహన్, లక్కాకుల మహేష్, రఘురామ్, కోటయ్య, కొత్తపెల్లి రవీందర్, జగదీష్, కొమరయ్య, ఫిట్ సెక్రటరీ మహేష్, ఆర్కే-7 ఫిట్ సెక్రటరీ పవన్, సత్యనారాయణతో పాటు బీసీ అధికారులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని సంఘీభావ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్లాస్టిక్ వద్దు-జూట్ బ్యాగ్ లు ముద్దు



**జన్నారం,జూలై3(ప్రజాజ్యోతి)**పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లు వద్దని-ప్రతి ఒక్కరు బట్ట(జూట్) సంచులు వాడాలని జన్నారం ఎఫ్ ఆర్ ఓ సాగర్ అన్నారు. ప్లాస్టిక్ రహిత దినోత్సవ సందర్భంగా శుక్రవారం రోజున మండల కేంద్రంలోని జన్నారం గ్రామపంచాయతీలో ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో సాగర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు భూమిలో కరగడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుందని,అదే ఒక బట్ట సంచి కేవలం 6 నెలల్లోనే భూమిలో కరుగుతుందని కావున ప్రతి ఒక్కరూ బట్ట సంచులే వాడాలని కోరారు.ఈ సందర్భంగా జన్నారం గ్రామస్తులకు బట్ట సంచులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఎస్ ఓ భోజ నాయక్, సర్పంచ్ అజ్మీర కళావతి నందు నాయక్,రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

## సిరికొండలో నూతన రెవెన్యూ, పోలీస్ స్టేషన్, ఎంపిడిఓ, కార్యాలయాలకు భవణాలు మంజూరు చేయాలి

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ను కలిసిన నాయకులు**



**సిరికొండ, జూలై 3 (ప్రజా జ్యోతి)** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏ ర్పడిన అనంతరం ఏర్పడిన పునర్విభజనలో భాగంగా సిరి కొండ మండలానికి కొత్త ప్రభు త్వ కార్యాలయాలకు భవనా లు మంజూరు చేయాలని స్థా నిక బిఆర్ఎస్ పార్టీ నాయకు లు విజ్ఞప్తి చేశారు. సిరికొండ మండలానికి ప్రభుత్వ కార్యా లయాలు పోలీస్ స్టేషన్, ఎం పీడీవో కార్యాలయం, తహసి ల్దార్ కార్యాలయం నూతన భవనాల మంజూరు చేయాలని శుక్రవారం సిరికొండ మండలం పార్టీ నాయకులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా దాదాపు మండలం ఏర్పడిన నుండి ఇతర ప్రవేట్ భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని, నూతన భవనాలు మంజూరు చేయాలని, సిరికొండ నుండి ఇచ్చోడ వెళ్లే మార్గం సిరికొండ మండల కేంద్రము నుండి ఇంద్రవెల్లి వెళ్లే మార్గం డబుల్ రో డ్డు మంజూరు చేసేలా కృషి చేయాలని కోరారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ సిరికొండ మండలం అభివృద్ధికి ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు, ఇచ్చోడ నుంచి డబుల్ రోడ్డు మంజూరుకు కృషి చేస్తానని, ఉన్నతాధికారులతో మాట్లాడి సంబంధిత మంత్రుల వద్దకు వెళ్లి తప్పకుండా మంజూరయ్యేలా కృషి చేస్తా నని మండల నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో బీ ఆర్ ఎస్ పార్టీ నా యకులు ఓరగంటి పెంటన్న, బియ్యాల మల్లేష్, తోకల చిన్న రాజన్న, సంతోష్, గణే ష్, లస్మన్న, బొడ్డు రవి, రాజే శ్వర్, చిన్న భీమన్న, సంతోష్, బొడ్డు సురేష్, పార్టీ నాయకు లు తదితరులు పాల్గొన్నారు.

## ఇక్బాల్ పూర్ గ్రామ పంచాయతీలో డ్రైడే కార్యక్రమం నిర్వహించిన ఎంపీడీవో రాథోడ్ రాధా



ఖానాపూర్ జూలై 3( ప్రజా జ్యోతి ) ఖానాపూర్ మండలంలోని ఎగ్బాల్ పూర్ గ్రామపంచాయతీలో డ్రైడే కార్యక్రమాన్ని ఎంపీడీవో రాథోడ్ రాధా శుక్రవారం ప్రారంభించారు గ్రామాల్లో ప్రజల ఇండ్లలో గల కూలర్లలో,పాత టైర్లలో, పాత కుండలలో, ఖాళీ సీసాలలో నిలువ ఉన్న నీటిని బయట పోసి దోమలు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆశా వర్కర్లని ఆదేశించారు ఆశా వర్కర్లను ప్రతి శుక్రవారం 50 ఇండ్లను సర్వే చేసి రిజిస్టర్ లో నమోదు చేసి తమకు చూపించాల న్నారు రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజా ఆరోగ్యాన్ని కాపాడేందుకే ప్రతివారం ఈ డ్రైడే కార్యక్రమ నిర్వహిస్తున్నామని ప్రజలు వీటిని గమనించి కార్యక్రమాల్లో పాలుపంచుకొని ఇంటి పరిసర ప్రాంతాలు శుభపరచుకోవాల న్నారు కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ, ఆశా వర్కర్ హెల్త్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు

## ప్లాస్టిక్ వద్దు-జూట్ బ్యాగ్ లు ముద్దు. ఎఫ్ ఆర్ వో వికాస్



జన్నారం,జూలై3(ప్రజాజ్యోతి) పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లు వద్దని-ప్రతి ఒక్కరు బట్ట(జూట్) సంచులు వాడాలని జన్నారం ఎఫ్ ఆర్ ఓ వికాస్ అన్నారు. ప్లాస్టిక్ రహిత దినోత్సవ సందర్భంగా శుక్రవారం రోజున మండల కేంద్రంలోని జన్నారం గ్రామపంచాయతీలో ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భం గా ఎఫ్ఆర్వో వికాస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు భూమిలో కరగడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుందని,అదే ఒక బట్ట సంచి కేవలం 6 నెలల్లోనే భూమిలో కరుగుతుందని కావున ప్రతి ఒక్కరూ బట్ట సంచులే వాడాలని కోరారు.ఈ సందర్భంగా జన్నారం గ్రామస్తులకు బట్ట సంచులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఎస్ ఓ భోజ నాయక్, సర్పంచ్ అజ్మీర కళావతి నందు నాయక్,రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు సవరణ ప్రక్రియపై ఇంటింటి సర్వేలో పాల్గొన్న కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు

**మంచిర్యాల, 3,జూలై (ప్రజాజ్యోతి):** మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 23వ డివిజన్‌లో ఓటరు సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)లో భాగంగా శుక్రవారం నిర్వహించిన " ఇంటింటి సర్వే" కార్యక్రమంలో జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎల్ఓలు, బీఎల్ఏలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకుని ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు నమోదు కావడం ఎంతో ముఖ్యమని, ప్రజలు సర్వే ప్రక్రియకు సహకరించాలని ఆమె సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల



మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య--మహేష్, 23వ డివిజన్ కార్పొరేటర్ కర్రు శంకర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీఎల్‌వోల నిర్లక్ష్యమా..? అవగాహన లోపమా..?"

...ప్రత్యేక ఓటర్ సవరణలో జాప్యం..!

....పత్రాలు అందించినా.. నింపేదెలా అని ప్రజల ఆవేదన

...బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు సేకరించాలని విజ్ఞప్తి

**మంచిర్యాల ప్రతినిధి జూలై 3, ప్రజా జ్యోతి:**మందమర్రి పట్టణంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇంటింటికీ ప్రత్యేక సవరణ దరఖాస్తు పత్రాలను పంపిణీ చేస్తున్నప్పటికీ, వాటిని ఎలా నింపాలో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా నిరక్షరాస్యులు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరిగా నివసించే వారు దరఖాస్తులను పూర్తి చేయలేక ఆందోళన చెందుతున్నారు. ఏ వివరాలను ఎక్కడ నమోదు చేయాలి, ఏ పత్రాలు జత చేయాలి, ఎవరికి అందించాలి అనే విషయాల్లో స్పష్టత లేక ప్రజలు అయోమయం పడుతున్నారు.కొన్ని ప్రాంతాల్లో బి ఎల్‌వోలు పత్రాలను పంపిణి చేసిన తర్వాత తిరిగి ఇళ్లకు వెళ్లి వాటిని సేకరించడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో నింపిన దరఖాస్తులను ఎవరికి ఇవ్వాలో తెలియక చాలామంది ఇళ్లలోనే ఉంచుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ఆలస్యం అయ్యే అవకాశముందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రత్యేకించి కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేర్ల సవరణలు, తొలగింపులు వంటి అంశాల్లో ప్రజలకు ప్రత్యక్ష సహాయం అవసరమని స్థానికులు పేర్కొంటున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరాలు




తెలియజేస్తూ, అవసరమైన చోట దరఖాస్తులను స్వయంగా నింపించి సేకరిస్తే కార్యక్రమం మరింత సమర్థవంతంగా సాగుతుందని వారు సూచిస్తున్నారు.అధికారులు బీఎల్‌వోలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, పంపిణీ చేసిన ప్రతి దరఖాస్తును తిరిగి ఇంటింటికీ వెళ్లి సేకరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే గ్రామాలు, వార్డులలో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు మార్గనిర్దేశం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ప్రజల డిమాండ్...**

బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు నింపించాలి.నింపిన పత్రాలను నేరుగా సేకరించాలి.వృద్ధులు, నిరక్షరాస్యులకు ప్రత్యేక సహాయం అందించాలి.ప్రతి వార్డులో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని గడువు లోగా పూర్తి చేయాలి. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు మరింత చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పెంబి మండల కేంద్రంలోని ఎస్సి కాలనీలో డ్రైనేజీ పూడికతీత

**సర్పంచ్ మల్లేపల్లి సత్యనారాయణ**

**ఖానాపూర్( పెంబి )జూలై 3 (ప్రజా జ్యోతి)**పెంబి మండల కేంద్రంలోని ఎస్సీ దళిత వాడలో ప్రధాన డ్రైనేజీలో పేరుకు పోయిన చెత్త తో ఆ ప్రాంతం ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని శుక్రవారం సర్పంచ్ మల్లేపల్లి సత్యనారాయణ జెసిపి ట్రాక్టర్ సహాయంతో పూడికతీత పనులు ప్రారం భించారు వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వర్షపు నీటితో మురికి కాలువలు నిండకుండా చెత్త చెదారం వల్ల నీరు నిలిచి అపరిశుభ్రత కలగకుండా ఉండేందుకే ఈ చర్యలు గై కొన్నట్లు ఈ సందర్భంగా సర్పంచ్ స్వామి అన్నారు ప్రజలు పరిశు భ్రతకు సహకరించి చెత్తను డ్రైనేజీల్లో వేయకుండా గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచాలన్నారు పంచాయతీద్వారా పరిశుభ్రతకు పలు సూచనలు సలహాలతో పాటు సమస్యను తీరుస్తామని స్వామి



అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్ చారి వార్డు సభ్యులు చాకలి పరమేష్ తదితరులు పాల్గొన్నారు

# బీఆర్ఎస్ పార్టీ నేతల పై మండిపడ్డ పైడిమల్ల నర్సింగ్

**మందమర్రి, జూలై 03 (ప్రజాజ్యోతి ):**సింగరేణి పరిరక్షణ పేరుతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇటీవల నిర్వహించిన కార్యక్రమం పై కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ పైడిమల్ల నర్సింగ్ విమర్శలు చేశారు. మందమర్రి పట్టణ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నర్సింగ్ మాట్లాడుతూ సింగరేణి పరిరక్షణ గురించి మాట్లాడే ముందు బీఆర్ఎస్ పార్టీ నేతలు తమ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, తీసుకున్న నిర్ణయాల పై ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నేతలు హరీష్ రావు, బాల్క సుమన్ మాట్లాడిన మాటలు పచ్చి అబద్ధాలని కొట్టిపారేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే సింగరేణి కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిందని అన్నారు. గతంలో ఓపెన్ కాస్ట్ గనులను వ్యతిరేకించిన బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేకే-2, ఆర్.కే.పురం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులకు అనుమతులు ఎందుకు ఇచ్చిందో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కార్మికుల సీ.ఎం.పీ.ఎఫ్ నిధులను ఇతర ప్రాంతాలకు కేటాయించడం, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సకాలంలో చెల్లింపులు జరగలేదని ఆరోపించారు. సింగరేణి వ్యవహారాల్లో బీఆర్ఎస్ నేతల జోక్యం పెరిగిందని అన్నారు. బాల్క సుమన్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాజీనామాలు చేయాలని అనడం ఏమిటో వారికే అర్థం కాని పరిస్థితి అన్నారు. కోల్ బెల్ట్ ప్రాంతానికి చెందిన మాజీ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల పై గతంలో వచ్చిన ఆరోపణలు, వివాదాలు గుర్తు చేశారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలు, నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తూ అభివృద్ధికి కృషి జరుగుతోందని, అలాంటి ప్రజాప్రతినిధిని రాజీనామా చేయాలని కోరడం సమంజసం



కాదన్నారు. సింగరేణి పరిరక్షణలో మాజీ కేంద్ర మంత్రి కాకా వెంకటస్వామి చేసిన సేవలను నర్సింగ్ గుర్తు చేశారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న సింగరేణి సంస్థను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి గట్టెక్కించడంలో కాక కీలక పాత్ర పోషించారని, ప్రస్తుతం పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ మెరుగైన పెన్షన్ కల్పించాలని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తున్నారని, అమృత్ పథకం కింద తాగునీటి ప్రాజెక్టుల అమలుకు కూడా కృషి చేస్తున్నారని అన్నారు. బాల్క సుమన్ గతంలో పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో సింగరేణి కార్మికుల సమస్యలను ఎన్నిసార్లు పార్లమెంట్ మాట్లాడారో ప్రజలకు చెప్పాలని నర్సింగ్ సవాల్ విసిరారు. అధికారం కోల్పోయిన తర్వాత మాత్రమే కార్మికుల సమస్యల పై మాట్లాడడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. ఇటీవల బీఆర్ఎస్ నాయకులు అక్రమ కేసులపై చేస్తున్న వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, గతంలో బాల్క సుమన్ చేసిన కొన్ని ప్రసంగాల పై చట్టపరమైన చర్యలు ఎదుర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, రాజు, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్పీ వేతనాల సవరణ అమలే లక్ష్యం

## ఐదో రోజుకు చేరిన సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్ష



**జైపూర్, జూలై 3 (ప్రజా జ్యోతి)** సింగరేణి అధికారుల కు వేతనాల సవరణ, పనితీరు ఆధారిత ప్రోత్సాహక వేతనం (పీఆర్పీ) అమలుతో పాటు పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ అధికారుల సంఘం ఆధ్వర్యం లో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం ఐదో రోజుకు చేరుకుంది. జైపూర్ మండలం లోని సింగరేణి విద్యుత్ థర్మ ల్ పవర్ ప్లాంట్ లో జరిగిన దీక్షలో అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని సందర్శించిన సంఘం ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహులు మాట్లాడుతూ అధికారుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి సంఘం కేంద్ర కమిటీ యాజమాన్యంతో నిరంతరం చర్చలు జరుపుతోందన్నారు. ఇటీవల యాజమాన్యం చర్చలకు ఆహ్వానించినప్పటికీ అవి పూర్తిస్థాయిలో ఫలించలేదని తెలిపారు. అధికారులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వేతనాల సవరణ, పీఆర్పీతో పాటు ఇతర సమస్యలన్నింటినీ సానుకూలంగా పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో పాల్గొంటున్న అధికారులు ఐకమత్యంతో ఉద్యమాన్ని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘం ఎస్‌టీపీపీ శాఖ అధ్యక్షుడు ధారావత్ పంతుల మాట్లాడుతూ, అధికారుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని సమన్వయం చేస్తూ ముందుండి నడిపిస్తున్న కేంద్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 1,800 మంది అధికారులకు వేతనాల సవరణ అమలు కాకపోవడం వల్ల కోల్ ఇండియా సంస్థలో అమలులో ఉన్న వేతన ప్రయోజనాలు సింగరేణి అధికారులకు అందడం లేదన్నారు. అలాగే 2022--23, 2023--24, 2024--25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన పీఆర్పీ ఇప్పటికీ విడుదల కాకపోవడంతో అధికారులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. రిలే నిరాహార దీక్షల్లో డిప్యూటీ జనరల్ మేనేజర్(ఆపరేషన్స్ అండ్, మెయింటెనెన్స్) వీరబ్రహ్మం, సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఈ అండ్ ఎం) పి.అప్పారావు, మేనేజర్ (ఫొరెస్ట్)బి. చంద్రమణి, సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్) కె. ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈ అండ్ ఎం) పి. పాల్ వినీత్ పాల్గొన్నారు.

## ఓటర్ల సవరణపై బీఎల్ఏ గంగాధర్ అవగాహన



**ఆసిఫాబాద్ జులై 3 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ వాంకిడి మండలంలోని ఖమన గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ గంగాధర్ ఖమన, తేలివాడ ప్రాంత ప్రజలకు ఓటర్ల జాబితా సవరణపై అవగాహన కల్పించారు. శుక్రవారం గ్రామంలో పర్యటించిన ఆయన ఓటర్ల జాబితాలో తప్పులుంటే వెంటనే సరిచేసుకోవాలని, కొత్త ఓటర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. బూత్ స్థాయిలోనే దరఖాస్తులు స్వీకరించి సవరణలు చేస్తామని తెలిపారు. ఓటు హక్కుపై అవగాహన లేని వారికి వివరించి, ఫారాలు నింపడంలో సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్

**తీగల అశోక్ కుమార్ ఆదేశాలతో అధికారికం గా నియమించాం, డా. జాడి దిలీప్ కుమార్**





**జులై 3,, సిర్పూర్ (టి) కాన్సెస్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** ఎస్సీ సంక్షేమ సంఘం సంస్థ విస్తరణ, బలోపేతం మరియు షెడ్యూల్డ్ కులాల సంక్షేమ లక్ష్యాల సాధన కోసం, సంఘం జాతీయ అధ్యక్షులు తీగల అశోక్ కుమార్ ఆమోదంతో డాక్టర్ జాడి దిలీప్ కుమార్ ఆదేశాలతో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం లోని జక్కాపూర్ గ్రామనికి చెందిన చాందేకర్ రాజేంద్రప్రసాద్ కు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా అధికారికంగా నియమిస్తున్నట్లు డాక్టర్ జాడి దిలీప్ కుమార్ తెలిపారు. షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ,విద్యా అభివృద్ధి ఉపాధి అవకాశాల పెంపు, సామాజిక న్యాయం సంక్షేమ కార్యక్రమాల అమలులో సంఘం ఆశయాలు, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన సమర్థవంతంగా పనిచేస్తారని విశ్వ సించారు. జిల్లా స్థాయి లో,నియోజకవర్గం, మండల సంఘం బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి, సామాజిక చైతన్య కార్యక్రమాల నిర్వహణకు అదేవిధంగా షెడ్యూల్డ్ కులాల సమగ్ర అభివృద్ధికి ఆయన తన సేవలను అంకితం చేస్తారని ఆశిస్తున్నామని జాడి దిలీప్ కుమార్ తెలియ జేశారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ చాందేకర్ కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వీరి పదవీకాలం విజయ వంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## రక్తదానం ప్రాణదానంతో స మానం

ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి
మావల రైతు వేదికలో రక్తదాన శిబిరం
పాల్గొన్న వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు
స్వయంగా రక్తదానం చేసిన శ్రీకాంత్ రెడ్డి



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 3 (ప్రజా జ్యోతి)** రక్తదానం ప్రాణ దానంతో సమానమని ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చై ర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మావల ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మావల రైతు వేదికలో వై ద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వ హిం చారు. ఈ కార్యక్రమానికి ఆది లాబాద్ వ్యవసాయ మార్కె ట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీ కాంత్ రెడ్డి, డీఎంహెచ్ఓ డా. పి. సాధన, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, డీపీఓ దేవిదా స్, డా. బి. దీపిక ముఖ్య అతి థిగా హాజరయ్యారు. ఈ శిబిరంలో 25 మంది యువకులు, స్థానికులు స్వచ్ఛందంగా రక్త దానం చేశారు. ఈ సందర్భంగా బోరంచు శ్రీకాంత్ రెడ్డి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడు తూ రక్తదానం చేయడం ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఈ కా ర్యక్రమంలో మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, బట్టి సా వర్గాం సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, సూపర్ వైజర్లు బి. సుభాష్, ఎ. సురేష్, శకుంతల, మేరీ, హెచ్ఏలు నల్ల ఈశ్వర్ రెడ్డి, పవార్ ప్రేమ్ సింగ్ , సీనియర్ అసిస్టెంట్ కారింగుల సుధీర్ కుమార్, ఎం ఎల్ ఎచ్ పిలు కృష్ణవేణి, ఆకాంక్ష, అశ్విని, రాధ, కె. శ్రీవాణి, మమత, తార, సజిదా, ఆశా కార్యకర్తలు, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్లు రహిమాన్, గజానంద్, స్థానిక నాయకులు మోసిన్, ఎస్కే ఆ లిమ్, కమర్, సుభాష్ తదిత రులు పాల్గొన్నారు.

## ఎన్యూమ రేషన్ పత్రాలు పంపిణీ చేసిన నాయకులు



**సిరికొండ, జూలై 3, (ప్రజా జ్యోతి)** ఎలక్షన్ కమిషన్ అఫ్ ఇండి యా "సర్" ప్రత్యేక సమగ్రసవరణ కార్యక్రమంలో భాగంగా శుక్ర వారం బోథ్ నియోజకవర్గం, సిరికొండ మండలంలోని సుంకిడి, కోసుపటేల్ గూడ, పాండుగూడ, రాయిగూడ 15 7 బూత్ బిఎల్ ఓ తో వైపేట్ బిఎల్ ఎ తొడసం భూపతి తో కలిసి . ప్రతి ఓటర్ ఇంటికి ఎ న్యూమరేషన్ ఫామ్ ఇవ్వడం జరిగిందని చెప్పారు. సిరికొండ కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షులు కంచం లక్ష్మన్ ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ఫారం ఎలా పూరించాలి వ్రాయడం గురించి చెప్పి ఎన్యూమరేషన్ ప్రక్రియ ను పరిశీలించి ఓటు విలువ గురించి తెలిపినారు. సుంకిడి గ్రామ సర్పంచ్ రాథో డ్ గణపతి, గ్రామ యువకులతో అక్కడ బిఎల్ ఎ తో కలిసి ఎన్యూమ రేషన్ పత్రాలు 200 దాకా నింపారు. ఈ కార్యక్ర మంలో అగ్రికల్చర్ మార్కెట్ డైరెక్టర్లు పూర్క జగన్,చవాన్ ప్రకాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వర్షపు నీరు నిలవకుండా ముందస్తుగా జెకె నగర్ లో చర్యలు

డిసిసి ఉపాధ్యక్షులు కౌన్సిలర్ రాజు రా సత్యం



**ఖానాపూర్ జూలై 3( ప్రజా జ్యోతి )** ప్రతి ఏటా వర్షాకాలంలో 11 వార్డులోని రాజీవ్ నగర్ కాలనీలో నిరు నిండి గృహస్థులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుంటాయి దాన్ని దృష్టిలో ఉంచుకొని మాజీ మున్సిపల్ చైర్మన్ డిసిసి కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ప్రస్తుత పదకొండవ వార్డు కౌన్సిలర్ రాజు రా సత్యం శుక్రవారం సాయంత్రం ప్రోక్లైన్తో చెట్లు చదరాలతో పాటు నిండిన నీటిని శుభ్రం చేశారు ఖానాపూర్ పట్టణంలోని రాజీవ్ నగర్ లొ పిచ్చి మొక్కలను జెసిబి సహాయంతో తొలగించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఎటువంటి సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సమస్యను పరిష్కరిస్తా మని అన్నారు రాద్ధాంతం పడకుండా సమన్వయంతో వర్షా కాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెలిగేందుకు 11వ వార్డు ప్రజలు సహకరించాలని సత్యం కోరారు ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కంఠం రవి లక్ష్మీపతి గౌడ్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

## బస్ లో పాస్ పోర్ట్ కోల్పోయిన యువకుడు

దొరికిన వారు తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికం



**కడెం, జూలై 16(ప్రజా జ్యోతి ):**కడెం మండలం సారంగాపూర్ గ్రామానికి చెందిన బొడిగె రమేష్ తన పాస్పోర్ట్ ను బస్ లో ప్రయాణిస్తుండగా కోల్పోయాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గత కొన్ని నెలల క్రితం తన పని నిమిత్తం ఇంటి నుండి బయలుదేరి వెళ్ళి కడెం నుండి ఖానాపూర్ కు బస్ లో వెళుతున్న సమయంలో మార్గమధ్యలో తన ఏం.5798732 నెంబర్ గల ఒరిజినల్ పాస్పోర్ట్ కోల్పోవడం జరిగింది అని అన్నాడు. పాస్పోర్ట్ కోల్పోయిన అనంతరం ఆనాటి నుండి నేటి వరకు ఎంత వెతికిన దొరకలేదు అని అన్నాడు. సోషల్ మీడియా తదితర వాటిలో ప్రసారం చేసిన కూడా కోల్పోయిన పాస్పోర్ట్ దొరకడం లేదు అని బాధ పడ్డాడు. పాస్పోర్ట్ అధికారులు స్పందించి మరల కొత్త పాస్పోర్ట్ ఇప్పించగలరు అని బొడిగె రమేష్ అధికారులను కోరుతున్నాడు.

# కౌలు రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం మానుకోవాలి

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి
రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 3 (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర రైతంగం అత్యంత దయనీయా దుస్థితిలో ఉండి, అత్యంత నిర్లక్ష్యానికి గురి ఔతున్నదని,కౌలు రైతులే మండలంలోని ధన్నూర్ (బి), కనుగుట్ట గ్రామాల కు చెందిన కౌలు రైతులతో మాట్లాడుతూ వారు సాగుచేస్తున్న పంటభూ ములలో వివిధ రకాలైన పం డించిన పంటలను మార్కెట్లో కౌలు రైతు పేరిట అమ్ముకుం దామంటే అమ్ముకోలేక నానా అవస్థలు పడుతున్న దృశ్యాలను చూస్తున్న క్రమంలో ఇప్ప టికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి వారికీ 2011 భూ ఆదికృత వాస్తవ సాగుదారుల చట్టాన్ని అమ లు చేసి కౌలు రుణాహర్హత కార్డులు ఇచ్చే విదంగా రాష్ట్ర ప్ర భుత్వం ప్రయత్నం చేయాలనీ రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.కౌలు రైతులకు రుణాహర్హత కార్డుల వలన భూ యజమా నికి ఎలాంటి సంబంధం లేకుం డానే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తీసుకోవ డానికి అవకాశాలు ఉంటాయ ని,తాము పండించిన పంట అకాల, అతి బారి వర్షాలకు పంటలు నష్టపోతే నష్టపరిహా రం వచ్చేవిదంగా తమ పంట లను మార్కెట్లో అమ్ముకునే వెసులుబాటు కల్పించే విదం గా అవకాశాలు ఉంటాయని ఆయన అన్నారు. ఎలాంటి భూమిలేని కౌలు రైతులకిరు ణాహర్హత కార్డుతో పాటు రైతు భరోసాతో పాటు రైతు భీమా ఉండేవిదంగా చూడవల సిన అవసరం ఉందని ఆయ న అన్నారు. కానీ ఆదిలాబాద్ జిల్లాలో దాదాపుగా 28,763 మంది కౌలు రైతులున్నట్లు మా నిర్ధారణలో తేలిందని, ప్రతి ఏడాదిలో కౌలు రైతులే ఎక్కువగా ఆత్మహత్యలు చే సుకున్నట్లు మా నిజ నిర్ధార ణలో తేలిందని,మరొక పక్క తాము సాగుచేసే పంటభూ మికి కౌలు డబ్బులు మరియు పంట పెట్టుబడికి అయ్యే ఖర్చులకు ప్రయివేట్, వడ్డీ వ్యాపారస్తులనే ఆశ్రహించవలసిన అవసరం ఉందని అయన అన్నారు.గుర్తింపు కార్డు ఆధా రంగా అన్ని ప్రభుత్వ పథకాలు వాస్తవ సాగుదారులుగా ఉన్న కౌలు రైతులకి అందించాలి. జిల్లాలో ఉన్న వివిధ రకాలైన బ్యాంకుల ద్వారా కమిటీ వేసి వారి ద్వారా నిర్ధి ష్టమైన ఆదేశాలు జిల్లా యం త్రాంగం ఎల్ ఈ సి కార్డు ఆధా రంగా పంట రుణాలు ఇచ్చేలా చూడవలసిన అవసరం ఎంతై నా ఉందని ఆయన అన్నారు.ప్రస్తుత ఈ ఖరీఫ్ సీజన్లో పత్తి, సోయబిన్, అంతర పంటగా కందులు,మొక్క జొన్న, పంటలను సాగుచేసుకునే విదం గా స్థానిక వ్యవసాయ అధికారులు ధ్రువీకరించి కౌలు రై తుల అడంగల్ పహాణిలో 16 వ కాలంలో ఖాస్తుదారి పేరిట ఉండే విదంగా చూడా లని అయన అన్నారు. ఇం దులో కిసాన్ మిత్ర ఫీల్డ్ కో ఆర్డినేటర్, షారుక్, సంతోష్, వెంకటరమణ, ప్రవీణ్, ప్రభా కర్,రాజు రామకృష్ణ, ఇస్తా రి,తదితరులు పాల్గొన్నారు.

# శుక్రవారం తప్పనిసరిగా 'ఫ్రై డే - డ్రైడే' పాటించాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 3 (ప్రజా జ్యోతి)** వర్షాకాలం ప్రారంభ మైన నేపథ్యంలో జిల్లా ప్రజలందరూ తమ ఇళ్లలో తప్పనిసరి గా ప్రతి శుక్రవారం 'ఫ్రైడే - డ్రై డే' కార్యక్రమాన్ని నిర్వహించా లని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పి లుపునిచ్చారు. శుక్రవారం స్థా నిక కెఆర్కె కాలనీలో డెంగ్యూ వ్యాధి నివారణ చర్యల్లో భా గంగా నిర్వహించిన ఫ్రైడే, డ్రై డే కార్యక్రమంలో మున్సిపల్, వైద్య సిబ్బందితో కలిసి ఆయన ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలను అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ఇళ్లలో నీటిని ఎక్కువగా నిల్వ ఉంచడం వల్ల అందులోనే దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరి యా, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అందుకే అవసరమైన మేరకే నీటిని నిల్వ చేసుకోవాలని, పాత్రలపై తప్పనిసరిగా మూతలు పెట్టాలని సూచిం చారు. డెంగ్యూ వస్తే ప్లేట్‌లెట్స్ పడిపోయి నెల రోజుల పాటు కోలుకోలేరని, కాబట్టి అనవస రమైన నీటిని నిల్వ ఉంచకుం డా వెంటనే పారబోయాలని సూచించారు. కాలనీల్లో శాని టేషన్, డ్రైనేజీ సమస్యల పరి ష్కారానికి ఇద్దరు జిల్లా అధి కారులను నియమించామని, అవసర మైతే అదనపు వాహ నాలతో శానిటేషన్ డ్రైవ్ ని ర్వహిస్తామని తెలిపారు. కె. ఆర్.కె కాలనీ అభివృద్ధికి, ము ఖ్యంగా డ్రైనేజీ సమస్యల పరి ష్కారానికి సుమారు రూ. 6 నుండి 7 కోట్ల నిధులు ఇప్పటి కే మంజూరయ్యాయని, త్వర లోనే ఈ పనులను ప్రారంభి స్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సాం స్కృతిక సారధి కళాకారులు ఇంటింటి సర్వేలో పాల్గొని ఫ్రైడే డ్రైడే పాటించాలని పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.సాధన, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, కౌ న్సిలర్ నాక్సేన్, ఆశాలు, కా లనీ ప్రజలు, మున్సిపల్, వై ద్య, ఇతర శాఖల అధికారు లు, సిబ్బంది తదితరులు పా ల్గొన్నారు.

# రాజు గోండుల కోటను దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి





జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 3, (ప్రజా జ్యోతి)** పర్యాటకులను ఆకర్షించేలా గోండు రాజుల కోట పునరుద్ధ రణ పనులు చేపట్టాలని కలె క్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని చారిత్రక రాజు గోండుల కోటను సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరందుతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి కలెక్టర్, పిఓ కోట పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి, అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారు లతో చర్చించారు. అనంతరం ఐటిడిఏ పిఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావే శంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గోండు రాజుల చరిత్రకు, గిరిజన సంస్కృతికి ప్రతీకగా నిలిచిన రాజు గోండుల కోట ను త్వరితగతిన పునర్నిర్మిం చాలని ఆదేశించారు. ఆధునిక సౌకర్యాలతో దేశవ్యాప్తం గా పర్యాటకులను ఆకర్షించేలా దీనిని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సంబంధిత శాఖల అధికారులను కోరారు. కోట పునర్నిర్మాణ పనుల్లో ఎక్కడా చారిత్రకతకు భంగం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు. భావితరాలకు గిరిజనుల గొప్ప చరిత్రను తెలియజేసే విధంగా కోటలో ఒక అత్యాధు నిక మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మ్యూజియం లో గోండు రాజుల వంశ చరిత్ర, వారి పాలన, సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ ఆనవాళ్లు, పురాతన వస్తువులు, చారిత్రక ఆధారాలను ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అదేవిధంగా కోట ప్రాంగణంలో గిరిజన సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక వేదిక, గిరిజన హస్తకళలు, సంప్రదాయ ఉత్పత్తుల విక్రయానికి మార్కెటింగ్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీ



టితో పాటు చిన్నారుల కోసం ప్రత్యేక పార్కు, క్రీడా ప్రాంగ ణం, సందర్శకుల కోసం రూఫింగ్ షెడ్లు, విశ్రాంతి భవనా లు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, ఆకర్షణీయమై న ఉద్యానవనాలు, విద్యుద్దీపాల అలంకరణ, పచ్చదనం పెంపు వంటి అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని పేర్కొన్నారు. సందర్శకులు కోట చరిత్రను సులభంగా తెలు సుకునే విధంగా సమాచార ఫ లకాలు, దిశానిర్దేశక బోర్డులు, డిజిటల్ సమాచార వ్యవస్థలను అందుబాటు లోకి తీసుకు రావాలన్నారు. కోట అభివృద్ధి ద్వారా స్థానిక గిరిజన యువ తకు ఉపాధి అవకాశాలు పెర గడంతో పాటు ఉట్నూర్ ప్రాంతం పర్యాటక రంగంలో ప్రత్యే క గుర్తింపు పొందుతుందని ఆ శాభావం వ్యక్తం చేశారు. ఐటి డిఏ పిఓ మంద మకరందు మాట్లాడుతూ రాజు గోండుల కోటను సుందరీకరించి దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందే పర్యాటక కేంద్రంగా తీర్చిది ద్దేందుకు అన్ని శాఖలు సమ న్వయంతో పనిచేసి త్వరిత గతిన కార్యాచరణ చేపట్టాల ని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో ఆర్కియాలజీ డైరెక్టర్ అర్జున్ రావు, అదనపు డైరెక్ట ర్ నరసింహులు, డిడి సాగర్, ఓఎస్డి రాజు, పర్యాటక శాఖ అధికారి రవికుమార్, ఎగ్జిక్యూ టివ్ ఇంజనీరింగ్ తానాజీ, ఏపీఓ పిబిటిజి ఆత్రం భాస్కర్, డిప్యూటీ డిఇఓ చందన్, ప్ర జాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొ న్నారు.

# జిల్లాలో ఆహార భద్రతా ప్రమా ణాలను పక్కాగా అమలు చే యాలి

### అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 3 (ప్రజా జ్యోతి)**ఆహార భద్రతా ప్రమాణాలను పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా లో ఆహార భద్రత శాఖ విభా గం పనితీరు, ఇప్పటివరకు చే పట్టిన వివిధ కార్యక్రమాల పు రోగతి, ఇతర అంశాలపై ఆ యన సమీక్షించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన, సురక్షి తమైన ఆహార పదార్థాలు అం దేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. హో టళ్లు, రెస్టారెంట్లు, స్వీట్ షాపులు, కిరాణా దుకాణాలతో పాటు ఆహార పదార్థాల తయారీ కేంద్రాల్లో క్రమం తప్ప కుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి, కల్తీకి పాల్పడే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం విష యంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భారతీయ ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు కీలక కార్యక్రమాలపై సమావేశంలో చర్చించి, 'ఈట్ రైట్ ఇండియా' వంటి వినూత్న కార్యక్ర మాలను క్షేత్రస్థాయికి తీసుకె ళ్లాలని, ప్రజల్లో ఆహార అల వాట్లు, పోషకాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూ చించారు. ప్రతి చిన్న, పెద్ద ఆహార వ్యాపార సంస్థ తప్పని సరిగా ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసె న్స్ లేదా రిజిస్ట్రేషన్ కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాల న్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా ఆహార భద్రతా అధికారి సునీత, మున్సి పల్ కమీషనర్ జగదీశ్వర్ గౌడ్, పంచాయితీ, విద్య, వై ద్యం, నీటి సరఫరా, సంక్షేమ, ఇతర శాఖల అధికారులు, త దితరులు పాల్గొన్నారు. సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా రెసిడెన్షియ ల్ స్కూల్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్





**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 3 (ప్రజా జ్యోతి)** ఉట్నూర్ మండలం కుమ్మరి తండాలో శుక్రవారం యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూ ల్ పనులను జిల్లా కలెక్టర్‌రా జర్షిషా పరిశీలించి అధికారులకు పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిశీలనలో ఐటీడీఏ పీఓ మంద మకరందు, ఆర్డీఓ మో హన్ సింగ్, తహసీల్దార్ రఘునాథ్‌రావు, ఇంజనీరింగ్, ఇతర అధికారులు, సిబ్బంది, కాం ట్రాక్టర్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు వాహనాల నిర్వహ ణకు నూతన కార్ హైడ్రాలిక్ వ్యవస్థ ప్రారంభం

**ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో హైడ్రాలిక్ లిఫ్ట్‌ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**వాహనాల నిర్వహణ, మర మ్మతులు మరింత సమర్థ వంతంగా చేపట్టాలని సూచన**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 3 (ప్రజా జ్యోతి)**జిల్లా పోలీసు శాఖలో వాహ నాల నిర్వహణను మరింత ఆధునికంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం వద్ద ఏర్పాటు చేసిన నూతన కార్ హైడ్రాలిక్ లిఫ్ట్ వ్యవస్థను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ గురువా రం జిల్లా పోలీసు ప్రధాన కా ర్యాలయంలో శాస్త్రోక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగాన్ని పరిశీలించి, వాహనాల మర మ్మతులకు అవసరమైన విడి భాగాలు, మెకానిక్ పనిచేసే గదిని తనిఖీ చేశారు. పోలీసు వాహనాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహిస్తూ, అత్య వసర విధులకు ఎలాంటి అం తరాయం కలగకుండా చూసుకోవాలని సంబంధిత అధికా రులకు సూచించారు. నూతన హైడ్రాలిక్ వ్యవస్థతో వాహనాల మరమ్మతులు వేగవంతంగా, నాణ్యతతో నిర్వహించేందుకు వీలుకలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో అదనపు ఎస్పీ (పరిపాలన) పి. మౌనిక ఐపీఎస్, డీఎస్పీ కమటం ఇంద్రవర్ధన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు టి. మురళి, ఎన్. చంద్రశేఖర్ మరియు రిజర్వ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్**

**తిరుపతి :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రేణిగుంట మండలం కరకంబాడి గ్రామం, తారకరామ నగరలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ లో భాగంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ శ్రీ కాళహస్తి ఆర్ డి ఓ భాను ప్రకాశ్ రెడ్డి తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటింటికీ నిర్వహిస్తున్న సర్వే, ఓటర్ల వివరాల ధృవీకరణ, దరఖాస్తుల స్వీకరణ, అవసరమైన పత్రాల పరిశీలన తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ -2026 లో భాగంగా 2002 ఓటర్ల జాబితాలోని ఓటర్ల జాబితా కి ప్రస్తుత ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను నాణ్యమైన ఓటర్ల జాబితా తయారు చేయడమే లక్ష్యం అని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, అర్హత లేని పేర్ల తొలగింపు, మార్పులు, చేర్పులు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం మాత్రమే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఓటరు నమోదు ప్రక్రియను సులభతరం చేయాలని, ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా నాణ్యతతో సర్వే పూర్తి చేసి ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించి ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు బి ఎల్ ఎ లు పాల్గొన్నారు.

# సాంకేతిక శిక్షణలో గిరిజన విద్యార్థులు రాణించాలి



జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ బ్యూరో,జూలై 3 , (ప్రజా జ్యోతి)**చదువుకే పరిమితం కాకుం డా, ఆధునిక సాంకేతిక శిక్షణ లోని గిరిజన విద్యార్థులు రా ణించాలని జిల్లా కలెక్టర్ రాజ ర్షి షా పిలుపునిచ్చారు. శుక్ర వారం ఉట్నూరులోనిప్రభుత్వ ఐటీఐ – అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ లో "ప్రాజెక్ట్ ఎక్స్‌పో 2026" ప్రదర్శనను ఐటీడీఏ పీఓ మంద మకరంద్ తో కలి సి ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వారు విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించి, వారు రూపొందించిన వినూత్న సాంకేతిక ప్రాజెక్టులను ఆసక్తిగా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ గిరిజన ప్రాంత విద్యార్థులు ఇంతటి అద్భుతమైన సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించడం అభి నందనీయమన్నారు. నేటి ఆధునిక యుగంలో కేవలం చదువుకే పరిమితం కాకుండా, ఇలాంటి ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు సరికొత్త ఆవిష్క రణలకు నాంది పలకాలన్నారు. టాటా భాగస్వామ్య ంతో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ ద్వారా లభిస్తున్న ఆధునిక శిక్షణను గిరిజన విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియో గం చేసుకోవాలని సూచించా రు. ఐటీడీఏ పీఓ మంద మ కరందు మాట్లాడుతూ, యు వత పారిశ్రామిక రంగానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకుని, భవిష్య త్తులో ఉద్యోగాలు వెతకడమే కాకుండా ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఉ న్నత చదువులకు ఐటీడీఏ త రఫున ఎల్లప్పుడూ పూర్తి స హకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలె క్టర్, పీఓ చేతుల మీదుగా ప్ర శంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మోహన్ సింగ్, జిల్లా కార్మిక శాఖ అధికారి ముత్యం, ఐటీ ఐ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఇతర అధికారులు, శిక్షకులు, అధ్యా పకులు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**వెక్టర్ జనిత వ్యాధుల నియం త్రణ సలహాలు, సూచనలకు టోల్ ఫ్రీ నంబర్ 94911031 08 ను సంప్రదించండి**

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**




**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 3, (ప్రజా జ్యోతి)** జిల్లాలో జాతీయ నులిపురు గుల నిర్మూలన దినోత్సవ కా ర్యక్రమాన్ని విజయవంతం చే యాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించి జాతీయ వెక్టర్ జనిత వ్యాధులని యంత్రణ కార్యక్రమంలో భాగంగా మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, భవిష్య త్తు కార్యాచరణపై కలెక్టర్ ది శానిర్దేశం చేశారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామసభల ద్వారా వెక్టర్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ ప్రోగ్రామ్ పై ప్రజలకు విస్తృత అవగాహ న కల్పించాలని, ప్రతి గ్రామ పంచాయతీ, వార్డు కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్ 949 1103108ను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూ చించారు. మున్సిపల్ కమిష నర్ అర్బన్ యాక్షన్ ప్లాన్ రూ పొందించాలని, రిసోర్స్ పర్సన్స్ అందరికీ అవగాహన క ల్పించాలని ఆదేశించారు. జవాన్లు, శానిటేషన్ వర్కర్లు, పీ డీఎంఏ సిబ్బంది సహాయంతో పట్టణ ప్రాంతాల్లోని హాట్ స్పా ట్లను గుర్తించి, మొదట ఫీవర్ సర్వే, ఆతర్వాత అవసరమైన చోట మెడికల్ క్యాంపులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రతి శుక్రవారం విధిగా 'డ్రై డే' కార్యక్రమాలను నిర్వహించాలని, పంచాయతీరాజ్ విభాగాల సహకారంతో నీరు నిల్వ ఉన్న చోట ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయాలని ఆదే శించారు. రెసిడెన్షియల్ పాఠ శాలలు, కళాశాలల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా శాని టేషన్ చర్యలు చేపట్టాలని జి ల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ముఖ్యంగా ఆశ్ర మం పాఠశాలలను పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు నిరంతరం సందర్శించి, అక్కడ అందించే ఆహారం, శానిటేషన్, కిచెన్ పరిసరాలను పర్యవేక్షించడం తో పాటు, అధికారులు స్వయంగా అక్కడ భోజనం చేసి నాణ్యతను పరిశీలించాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా జిల్లాలో జాతీయ నులిపురు గుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం 13 జూలై 2026 న ప్రారంభమై, 20 జూలై 202 6 నాటికి మాప్-అప్ ప్రక్రియ తో ముగుస్తుందని తెలిపారు. ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల లోపు ఉన్న పిల్ల లందరికీ ఆల్బెండజోల్ టాబ్లె ట్లు పంపిణీ చేయాలని, ఇం దులో 1 నుండి 2 సంవత్సరా ల వయస్సు పిల్లలకు సగం టాబ్లెట్ నలిపి వేయాలని, 2 నుండి 19 సంవత్సరాల వయస్సు పిల్లలకు ఒక పూర్తి టాబ్లెట్ అందించాలని సూచించారు. ఈ టాబ్లెట్ల పంపిణీ అంతా క్లాస్ టీచర్, అంగన్ వాడీ టీచర్ లేదా ఆశా వర్కర్ల ప్రత్యక్ష పర్యవేక్ష ణలోనే సురక్షితంగా జరగాలని అధికారు లను ఆదేశించారు. ఈ సమా వేశంలో స్థానిక సంస్థల అదన పు కలెక్టర్ రాజేశ్వర్, డీఎం అండ్ హెచ్ ఓ సాధన, మున్సి పల్ కమీషనర్ జగదీశ్వర్ గౌ డ్, జిల్లా విద్య శాఖ అధికారి మాధవి, ప్రోగ్రాం అధికారిను మలత, పంచాయితీ, విద్య, వైద్యం, నీటి సరఫరా, సంక్షే మ, ఇతర శాఖల అధికారు లు, తదితరులు పాల్గొన్నారు.